పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు భారీగా దరఖాస్తులు

హైదరాబాద్ పెన్ పవర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు దరఖాస్తుల సంఖ్య పెరిగింది. గతంతో పోలిస్తే రెండు నియోజకవర్గాల్లో పట్టభద్రులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ నియోజకవర్గంలో 5.77 లక్షల దరఖాస్తులు వచ్చాయి. నల్గొండ – వరంగల్ – ఖమ్మం నియోజకవర్గంలో 6.52 లక్షల దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి ఈనెల 25న ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేస్తారు. దానిపై 25 నుంచి డిసెంబర్ పదో తేదీ వరకు అభ్యంతరాలు, వినతులకు అవకాశం ఉంటుంది. వాటి పరిష్కారం తర్వాత డిసెంబర్ 30న ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. అయితే, అభ్యంతరాల సమయంలోనూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. తుది జాబితా ప్రకటించిన తర్వాత నామినేషన్ల దాఖలు చివరి తేదీ వరకు కూడా దరఖాస్తుకు అవకాశం ఉంటుంది.



పెన్ పవర్
తెలంగాణ రౌండప్

ఫాక్స్ సాగర్ డైవర్షన్ నాలా కబ్జా యత్నం..!

- మట్టి, భవన నిర్మాణ వ్యర్థాలతో పూడ్చివేతకు పాల్పడిన అక్రమార్కులు..
- రంగంలోకి దిగి అడ్డుకున్న హైడ్రా.. జేసీబీ, టిప్పర్, ట్రాక్టర్ సీజ్ చేసిన అధికారులు..
- వాహనాల యజమానులను పోలీసులకు అప్పగింత.. నాలాలో వేసిన మట్టి తొలగింపు..!



జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు నాలాలో నింపిన మట్టిన తొలగిస్తున్న హైడ్రా బుల్డోజర్..



చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల తొలగింపు..!

ఫాక్స్‌సాగర్ చెరువు పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన కట్టను కూడా హైడ్రా తొలగించింది. అదేవిధంగా చెరువుకు అవతలివైపు ఉన్న ఫామ్‌హౌస్‌కు వెళ్లేందుకు నిర్మించిన సిమెంట్ రోడ్డును సైతం తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. చెరువు పరిధిలోని భూములు, నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడటంతో పాటు, చెరువు సహజ స్వరూపాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.. చెరువుల డైవర్షన్ నాలాలు, నీటి ప్రవాహ మార్గాలను పూడ్చివేయడం వల్ల వర్షాకాలంలో వరద నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, వరద విపత్తులు, ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని, ఇలాంటి ఆక్రమణలపై హైడ్రా ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు..

జీడిమెట్ల, పెన్ పవర్, నవంబర్ 6:

చెరువులు, నాలాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న హైడ్రాకు మరో ఆక్రమణ యత్నం ఎదురైంది.. ఓవైపు ఫాక్స్‌సాగర్ చెరువులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్న తరుణంలో.. ఫాక్స్‌సాగర్ చెరువు పరిధిలోని డైవర్షన్ నాలాను మట్టి, నిర్మాణ వ్యర్థాలతో పూడ్చివేసి ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించగా, హైడ్రా అధికారులు అప్రమత్తం అయ్యారు.. అక్రమార్కులను అడ్డుకున్నారు. జీడిమెట్ల సుభాష్‌నగర్‌లోని ఫాక్స్‌సాగర్ సాగర్ తూము వద్ద శుక్రవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు జేసీబీ, టిప్పర్, ట్రాక్టర్‌లతో నాలా ప్రాంతంలో మట్టి, నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు.. ఈ డంపింగ్ కార్యకలాపాలకు ఉపయోగించిన జేసీబీతో పాటు టిప్పర్ (TS12UB6476), ట్రాక్టర్ (TS19TA1588)లను హైడ్రా బృందం స్వాధీనం చేసుకుంది. వాహనాలను సీజ్ చేయడంతో పాటు, యజమానులను పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు, డైవర్షన్ నాలాలో ఇప్పటికే పోసిన మట్టిని తొలగించే పనులను, వెంటనే హైడ్రా అధికారులు చేపట్టారు. కేవలం అక్రమ డంపింగ్‌ను అడ్డుకోవడమే కాకుండా, నాలా ప్రవాహానికి అడ్డంకిగా మారిన మట్టిని కూడా తొలగించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు..



లక్డీకాపూల్ జంక్షన్‌లో వన్‌వే?..

పరిశీలించిన సజ్జనర్, జోయెల్ డేవిస్



హైదరాబాద్ పెన్ పవర్: కేబీఆర్ పార్క్ వద్ద వన్‌వే విధానం సత్ఫలితాలు ఇస్తుండటంతో నగరంలోని మరో కీలక ప్రాంతంలోనూ వన్‌వే అమలుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. నిత్యం వాహనాల రద్దీతో ఇబ్బందులు ఎదురయ్యే లక్డీకాపూల్ పరిసరాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కొత్త వన్‌వే విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ ఇతర అధికారులతో కలిసి బైక్‌పై క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ద్వారకా హోటల్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, ఓల్డ్ కంట్రోల్ రూమ్ జంక్షన్లలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి ప్రతిపాదిత వన్‌వే మార్గాలపై సూచనలు చేశారు. ఓల్డ్ కంట్రోల్ రూమ్, రవీంద్రభారతి, ఇక్బాల్ మినార్, సచివాలయం జంక్షన్ల మధ్య వాహనాల రాకపోకలను మళ్లించేలా మూడు కీలక

-5 లో

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'..

త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

- రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మంది పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- యాప్ ద్వారా ఆరోగ్య వివరాల నమోదు.. రిస్క్ ఆధారంగా వర్గీకరణ
- ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా వైద్య సాయం, కౌన్సెలింగ్ ఏర్పాటు
- వ్యాధులు ముదరక ముందే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యం

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను

-5 లో



ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మై-క్యూర్ సిటిజన్ యాప్‌లో ఫిర్యాదును క్లోజ్ చేసిన అధికారుల ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఫిర్యాదును మూసివేయడంలో చూపిన అత్యుత్సాహం, ప్రభుత్వ భూమి పరిరక్షణలో మాత్రం ఎందుకు కనిపించలేదనే ప్రశ్నలు గాజులరామారం సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంపై వెల్లువెత్తుతున్నాయి.. మై-క్యూర్ ఫిర్యాదు రీఓపెన్ కావడం మాత్రమే కాదు, ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని పూర్తిగా తొలగించి, అనుమతులను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తానని ఫిర్యాదుదారుడు మధుబాబు స్పష్టం చేస్తున్నారు.. కేవలం యాప్‌లో ఫిర్యాదును రీఓపెన్ చేయడం, పెంట్‌హౌస్ స్లాబ్‌కు రంధ్రాలు చేయడం కాకుండా, ప్రభుత్వ భూమిని కాపాడేందుకు గాజులరామారం సర్కిల్-57 డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

- అక్రమ నిర్మాణం కూల్చకుండా పెంట్‌హౌస్‌పైన స్లాబ్ కటింగ్ ఏమిటన్న ప్రశ్నలు..?
- ఫిర్యాదుతో స్పందించిన సిఎంసి అధికారులు.. మై-క్యూర్ ఫిర్యాదు రీఓపెన్.. పోలీస్ ఫిర్యాదుపై విచారణ..
- మై-క్యూర్ గ్రీవెన్స్ ఐడీ: 2109266155666. ఫిర్యాదు అంశం: ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ.. సర్వే నెం. 329..
- ఫిర్యాదు దారుని డిమాండ్: భవన అనుమతుల రద్దు, నిర్మించిన భవనం కూల్చివేత..
- ప్రస్తుత యాప్ స్టేటస్: మళ్ళీ రీఓపెన్. పోలీస్ పిటిషన్ నెంబర్: CYB/JGTA_CYB/051126/03806..
- పోలీస్ శాఖ స్పందన: పిటిషన్‌ను విచారణ అధికారికి కేటాయింపు..



స్లాబ్‌కు రంధ్రాలు చేస్తే..! ప్రభుత్వ భూమి కాపాడినట్టేనా..?



- ప్రభుత్వ భూమిలో నిర్మాణం.. ప్రైవేటు సర్వే నెంబర్‌లపై అనుమతులు మంజూరు..?
- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదును అధికారులు ఎందుకు క్లోజ్ చేశారు..? బేరం కుదుర్చుకున్నారా..?
- పెంట్‌హౌస్‌పై స్లాబ్ కటింగ్‌తో అక్రమ నిర్మాణంపై చర్యలు పూర్తయినట్టేనా..?
- ఐదు అంతస్తుల నిర్మాణంపై ఆరోపణలుంటే..! మొత్తం భవనంపై చర్యలేవీ..?
- ఫిర్యాదు రీఓపెన్ చేయడమే పరిష్కారమా..? ప్రభుత్వ భూమిని కాపాడటం ముఖ్యమా..?

మై-క్యూర్ యాప్ ప్రస్తుత స్టేటస్..కంప్లైంట్ రీఓపెన్..



మై-క్యూర్ యాప్‌లో స్టేటస్: కంప్లైంట్ 'రీ-ఓపెన్'..



సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్‌లో బిల్డింగ్ డిమాలిషన్ అంటూ క్లోజ్ చేసిన యాప్..(గతంలో)

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 6:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) రూపొందించిన మై-క్యూర్ సిటిజన్ యాప్ లక్ష్యాన్నే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు నీరుగారుస్తున్నారా..? ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతోందంటూ ఫిర్యాదులు అందినా, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టకుండా ఫిర్యాదులను మూసివేయడం వెనుక ఆంతర్యమేమిటి..? అనుమతుల మాటున ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు..? ఇప్పుడు గాజులరామారం సర్కిల్-57 టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. గాజులరామారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమి అయినప్పటికీ.. సమీపంలోని పట్టా భూములకు సంబంధించిన సర్వే నెంబర్ల ఆధారంగా నిర్మాణ అనుమతులు తీసుకుని, ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. ఈ అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు దారుడు మధుబాబు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నిర్మాణం పూర్తయ్యే వరకు నిర్లక్ష్యం వహించారని తెలిపారు.. నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగటం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తుంది.. ఈ వ్యవహారంపై 'పెన్‌పవర్' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో సిఎంసి అధికారులు స్పందించినట్లు తెలుస్తోంది.. అంతకుముందు మై-క్యూర్ సిటిజన్ యాప్‌లో నమోదు చేసిన ఫిర్యాదును సంబంధిత అధికారులు క్లోజ్ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతోందని, భవన అనుమతులను రద్దు చేసి, ఇప్పటికే నిర్మించిన భవనాన్ని పూర్తిగా కూల్చివేయాలని ఫిర్యాదు దారుడు కోరినా..! సమస్యకు పరిష్కారం కాకుండానే ఫిర్యాదును మూసివేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.. దీంతో ఫిర్యాదుదారుడు గాజులరామారం సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల వ్యవహారశైలిపై సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.. ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు స్పందించడంతో మై-క్యూర్ యాప్‌లో గతంలో క్లోజ్ చేసిన ఫిర్యాదును తిరిగి రీఓపెన్ చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ప్రస్తుతం వెలుగులోకి వచ్చాయి..

మై-క్యూర్ యాప్‌లోని గ్రీవెన్స్ స్టేటస్ ప్రకారం ఫిర్యాదు ఐడీ 2109266155666. 2026 సెప్టెంబర్ 21న ఉదయం 10:55:44 గంటలకు నమోదైన ఈ ఫిర్యాదులో ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, అంశాన్ని ప్రస్తావించారు. గాజులరామారం గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 329లో నిర్మించిన భవనానికి సంబంధించిన అనుమతులను రద్దు చేయడంతోపాటు, నిర్మాణాన్ని కూల్చివేయాలని ఫిర్యాదుదారుడు కోరారు. తాజాగా ఈ ఫిర్యాదు స్టేటస్ రీఓపెన్ అయినట్టు ఫిర్యాదు దారుడు తెలిపారు.. మరోవైపు పోలీస్ శాఖకు చేసిన ఫిర్యాదుపైనా, విచారణ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఫిర్యాదుదారుడికి సందేశం అందింది. CYB/JGTA_CYB/051126/03806 నెంబరుతో నమోదైన పిటిషన్‌ను విచారణ అధికారికి అప్పగించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ నుంచి మెసేజ్ వచ్చినట్లు మధుబాబు వెల్లడించారు. దీంతో మున్సిపల్ యంత్రాంగం పరిధిలోనే కాకుండా పోలీస్ శాఖ పరంగానూ ఈ వ్యవహారంపై విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది.. అయితే, ఫిర్యాదు రీఓపెన్ కావడం, పోలీస్ ఫిర్యాదుపై విచారణకు ఆదేశించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని ఫిర్యాదు దారుడు స్పష్టం చేస్తున్నారు.. మరోవైపు సంబంధిత అక్రమ నిర్మాణంలో, శుక్రవారం ఒక స్లాబ్‌కు రంధ్రాలు చేసినట్లు సమాచారం.. అధికారుల చర్యలపై మరిన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిలో ఐదు అంతస్తుల అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో.. మొత్తం అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టకుండా.. కేవలం పెంట్‌హౌస్ స్లాబ్‌కు రంధ్రాలు చేస్తే, ప్రభుత్వ భూమి కాపాడినట్టేనా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. కటింగ్ చర్యలు చేపట్టడం దేనికి సంకేతమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి..స్లాబ్‌కు రంధ్రాలు చేయడం వల్ల నిర్మాణం పూర్తిగా తొలగించినట్లవుతుందా..? ప్రభుత్వ భూమి ఆక్రమణ సక్రమం అవుతుందా..? అనుమతుల దుర్వినియోగంపై విచారణ జరిపి, అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించకుండా పాక్షిక చర్యలతో సరిపెట్టడం వెనుక కారణాలేమిటి..? అన్న ప్రశ్నలు అనేక అనుమానాలకు తావిస్తోంది..

‘ధరణి’ అక్రమాలపై సీఐడీ కీలక ఆపరేషన్

15 బృందాలతో ఏకకాలంలో సోదాలు.. నలుగురి అరెస్టు



హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్: తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం ఏకకాలంలో 15 సీఐడీ బృందాలు ఆపరేషన్ నిర్వహించి పలువురు ‘ధరణి’ ఆపరేటర్లతోపాటు ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్‌లో పలువురిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ సీఐడీ కార్యాలయానికి తరలించాయి. సాగుభూముల లావాదేవీల పోర్టల్ ధరణిలో అక్రమాలను నిగ్గు తేల్చే క్రమంలోనే సీఐడీ ఈ కఠినచర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణ అనంతరం వీరిలో నలుగురి పాత్రపై స్పష్టత రావడంతో అరెస్టు చేశాయి. ధరణి పోర్టల్‌లో అక్రమాలపై కొన్ని రోజులుగా ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక విచారణ కమిటీ (సెట్) ఆరా తీస్తున్న సంగతి తెలిసిందే. ఆ కమిటీ పరిశీలనలో తేలిన అంశాల ఆధారంగానే సీఐడీ తాజా కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పలు బృందాలతో తాజా ఆపరేషన్ చేపట్టింది. అయితే ఈ ఆపరేషన్ గురించి సీఐడీ ఉన్నతాధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

సెట్ విచారణ నేపథ్యంలో కీలక పరిణామం

ధరణిలో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇటీవలే సెట్‌ని ఏర్పాటు చేసింది. సీఐడీ డీజీ చారుసిన్హా నేతృత్వంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సాంకేతిక నిపుణులు.. మొత్తం ఏడుగురితో ఏర్పాటైన ఈ కమిటీ కొన్ని రోజులుగా విస్తృతంగా విచారణ జరిపింది. రెవెన్యూ కార్యాలయాల్లో ధరణి పోర్టల్‌ను నిర్వహించే ఆపరేటర్లు, అనధికారిక వ్యక్తులకు ఈ అక్రమాల్లో ప్రమేయముందని ఫోరెన్సిక్ విచారణలో గుర్తించినట్లు సమాచారం. ధరణి పోర్టల్ ఆపరేటర్లు కీలకంగా వ్యవహరించడం వల్లే ఈ దందా సాగిందనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, భువనగిరి.. తదితర జిల్లాల్లో అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడి విలువైన భూముల యాజమాన్య హక్కులు మార్చారనే ఆధారాలు సేకరించినట్లు తెలిసింది.

ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విలువైన భూముల కేసులు కొన్ని న్యాయస్థానాల పరిధిలో ఏళ్ల తరబడి విచారణలో ఉన్నాయి. ఈ క్రమంలో మధ్యంతరంగా ఇచ్చే కొన్ని ఆదేశాలను ఆసరాగా చేసుకుని విలువైన భూముల యాజమాన్య హక్కులనూ మార్పిడి చేసినట్లు వెల్లడైందని సమాచారం. కొన్ని భూపార్సిళ్లకు సంబంధం లేని తీర్పులను అన్వయించి భూములపై హక్కులు కొట్టేశారన్న ఆరోపణలపైనా కీలక సమాచారం లభ్యమైనట్లు తెలుస్తోంది. భూదాన్ భూములకు బైనంబర్లతో హక్కులు మార్చారనే ఫిర్యాదులపైనా ఆరా తీశారు. ఎక్కడ, ఎవరు, ఏ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి పోర్టల్‌లోకి లాగిన్ అయ్యారు..? ఎలాంటి మార్పులు చేశారనే అంశంలో డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ఆడిట్‌లో కనుగొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే సీఐడీ తాజా ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం.

లక్డీకాపూల్ జంక్షన్‌లో వన్‌వే?..

పరిశీలించిన సజ్జనర్, జోయెల్ డేవిస్

-3 పేజి తరువాయి

మార్గాలను ప్రతిపాదించారు. దీనిపై జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి తొలుత ప్రయోగాత్మకంగా వన్‌వే విధానాన్ని అమలు చేయనున్నారు. మరోవైపు కేబీఆర్ పార్క్ వద్ద ఇప్పటికే అమల్లో ఉన్న వన్‌వే మార్గాన్ని పరిశీలించిన సీపీ.. పెరుగుతున్న రద్దీని నియంత్రించేందుకు అదనంగా మరో ట్రాఫిక్ లేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అడ్డంకిగా ఉన్న భూగర్భ పైపులైన్లు, విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేబీఆర్ పార్క్ వద్ద ట్రాఫిక్ నిర్వహణలో వచ్చిన ఫలితాల నేపథ్యంలో నగరంలోని ఇతర రద్దీ ప్రాంతాల్లోనూ అవసరాన్ని బట్టి వన్‌వే విధానాన్ని విస్తరించేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం ‘ఫిట్ కాప్’..

త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

-3 పేజి తరువాయి

అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (బీవీ×), జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు.సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లోకి లాగిన్ కావచ్చు. వారు అందించిన సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవి తీవ్రం కాకముందే వైద్య సహాయం అందించడం ‘ఫిట్ కాప్’ ప్రాథమిక లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో ఆరోగ్య స్పృహను పెంచి, నివారణ చర్యలను ప్రోత్సహించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు, విభాగాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. ‘ఫిట్ కాప్’ సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటానికి ఒక ముఖ్యమైన వ్యవస్థాగత యంత్రాంగంగా ఎదుగుతుందని డీజీపీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో మారని తీరు

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:

కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ఢిల్లీలో జరిగిన ‘ఓట్ చోరీ’ ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సన్నెనన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు. మరోవైపు ఈ అంతర్గత కుమ్ములాటల వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి

ఉన్నత విద్యలో ఏఐ వినియోగంతో

విప్లవాత్మక మార్పులు

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:

ఉన్నత విద్యలో ఏఐ వినియోగంతో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ‘నెక్ట్ 1.0’ సదస్సు నిర్వహించారు. క్యాంప్‌ఎక్స్ ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో కొండాపూర్లోని గూగుల్ హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు వైస్ ఛాన్సలర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏఐ సహా ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పరీక్షల నిర్వహణ, డిజిటల్ మూల్యాంకనం, బోధన, క్యాంపస్ పరిపాలనలో ఏఐ వినియోగంపై సదస్సులో చర్చించారు.

క్రీడా అకాడమీల నిర్వహణకు సరికొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్

ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:

క్రీడా అకాడమీల నిర్వహణకు సరికొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చింది. వెబ్సాట్స్ అభివృద్ధి చేసిన స్పోర్ట్-ఈ (ప్లాట్‌ఫామ్ను హైదరాబాద్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, మాజీ క్రికెటర్ చాముండేశ్వరనాథ్ కలిసి ఆవిష్కరించారు. క్రీడా వేదికలు, అకాడమీల నిర్వహణను సులభతరం చేయడమే ఈ ప్లాట్‌ఫామ్ ప్రధాన లక్ష్యమని గోపీచంద్ తెలిపారు. ఆన్లైన్ బుకింగ్స్, చెల్లింపులు, కస్టమర్ల వివరాలు, మార్కెటింగ్ వంటి సేవలను ఒకే డ్యాష్‌బోర్డ్ ద్వారా నిర్వహించుకోవచ్చన్నారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత అనలిటిక్స్, రిపోర్టింగ్ సదుపాయాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

‘ప్రమాదం’లో మహిళల ప్రాణాలు

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్: వాహనాల స్టీరింగ్ పట్టుకోకపోయినా రోడ్లపై మహిళల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తున్నప్పుడు...రోడ్లపై నడుచుకుంటూ వెళుతున్నప్పుడు ఎక్కువ మంది మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో 2025లో జరిగిన రోడ్డు ప్రమాదాల గణాంకాలను రవాణాశాఖ ఇటీవల విశ్లేషించింది. బైక్‌లు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు నడిపే వారి నిర్లక్ష్యం, తప్పిదాల కారణంగా మహిళలు బలవుతున్నారనే చేదు వాస్తవాన్ని ఈ గణాంకాలు బయటపెట్టాయి. కుటుంబ సభ్యుల డ్రైవింగ్ లోపాలు కూడా శాపాలుగా మారుతున్నాయని తేలింది. ‘ముఖ్యంగా ద్విచక్ర వాహనాల్లో వెనక కూర్చుని ప్రయాణించే మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది 315 మంది ఇలా ప్రాణాలు కోల్పోయారు. మహిళలు చంటిబిడ్డతో టూవీలర్‌పై సురక్షితంగా కూర్చునే అవకాశం ఉండదు. ఇలాంటి సందర్భాలలో అతివేగం, అకస్మాత్తుగా బ్రేకులు వేయడం, వాహనం అదుపు తప్పడం, చీర కొంగు చక్రాల్లో ఇరుక్కోవడం వంటివి చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోవడమో, తీవ్రంగా గాయపడటమో జరుగుతోంది’ అని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

రోడ్డు దాటడానికీ భరోసా లేదా?



సంవత్సర కాలంలో ఏకంగా 331 మంది మహిళలు నడిచి వెళ్తున్న సమయాల్లో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. పిల్లలతో రద్దీ రోడ్లను దాటుతూ, వాహనం దిగి ఊర్లోకి వెళ్లే క్రమంలో హైవేలు దాటుతూ వాహనాలు ఢీకొని చనిపోయారు. ‘ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే సమయంలో వెనక కూర్చొనే మహిళలు హెల్మెట్ ధరించేలా చూడటం, కార్లలో ముందు వెనుక ప్రయాణికులు సీట్ బెల్టులు వాడేలా అవగాహన కల్పించడం, ఆటోలలో ప్రయాణికుల రక్షణను మెరుగుపరచడం, పాదచారులకు సురక్షిత మార్గాలు కల్పించడం వంటి చర్యలతో ఈ తరహా మరణాలను కట్టడి చేయొచ్చని’ రవాణాశాఖ అధికారులు తెలిపారు.

కే.పి.హెచ్.బి భూములను ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమ్మేశారు

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:

కే.పి.హెచ్.బి భూములను ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమ్మేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు.

శుక్రవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధముగా మహిళా పార్కులను, చిల్డ్రన్ పార్కులను, ఇండోర్ స్టేడియం, ఆట స్థలాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. రెండు వేల కోట్ల రూపాయలతో అభివృధి పనులు చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం . సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు వేల కోట్ల రూపాయలు భూములను అమ్మేశారు. హౌసింగ్ బోర్డ్ వీసీ గౌతం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

రేపటి తరాలకు భూములు లేకుండా ప్రభుత్వ భూములను అమ్మేస్తే రాబోయే భావితరాలు ఎలా బ్రతకాలి. హైదరాబాద్ ప్రజలకు శాపంగా మారింది కాంగ్రెస్ ప్రభుత్వం . మియాపూర్ భూములలో ప్రభుత్వ భూములను కాపాడింది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ . సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక మేము కాపాడము అని రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టుకున్నాడు ప్రజావసరాలకు కొరకు పెట్రోల్ పంపు కోసం ఉన్న స్థలాన్ని అమ్మకాలానికి టెండర్లు పిలిపిస్తున్నారు. ఇంత పెద్ద కే.పి.హెచ్.బి కాలనీలో ఫైర్ స్టేషన్ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ప్రతిసారి హౌసింగ్ బోర్డు భూములు అమ్మేశారు. నగర ప్రజలు కరెంట్ సరిగ్గా లేక నీళ్ళు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలీబాబా అరడజను దొంగలు మాత్రం భూములు అమ్మేయడమే టార్గెట్ గా పనిచేస్తున్నారు .కనీసం హైదరాబాద్ నగరం మీద అవగాహన లేక హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులు

పెడుతున్నారు. హౌసింగ్ బోర్డ్ అమ్మేయాలని చూస్తే కచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డినీ అడ్డుకుంటాం. ఎవరైనా టెండర్ల పాల్గొన్న ఖచ్చితంగా అడ్డుకుంటాం. ప్రాణాలపోయేనా సరే ప్రజల తరుపున నిలబడుతాం ప్రభుత్వ భూములను కాపాడుతాం. ప్రజల తరుపున ప్రశ్నిస్తుంటే కార్యకర్తలను విలేకర్లపై కేసులు పెడుతున్నారు. పార్టీలకు అతీతంగా హౌసింగ్ బోర్డ్ భూములకు కాపాడాలని కోరుతున్నామని అన్నారు.

స్పోర్ట్స్ బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్: స్పోర్ట్స్ బైక్ కొనివ్వలేదని డిగ్రీ చదువుతున్న యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జశ్వంత్ తేజ (20) పట్టణంలో స్నేహితులతో అద్దె ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు..

జశ్వంత్ స్పీడ్‌గా వెళ్లే స్పోర్ట్స్ బైక్ కొనివ్వాలని తండ్రిని అడిగాడు. ఇల్లు కట్టేది ఉంది. సాధారణ బైక్ కొనిస్తానని తండ్రి సముదాయించాడు. దీంతో మనస్తాపం చెందిన జశ్వంత్ అక్టోబర్ 14న ఇంటి డాబాపై గడ్డి మందు తాగి, హైదరాబాద్‌లో ఉన్న అన్న చరణ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. చరణ్ వెంటనే సమాచారం ఇవ్వగా, జశ్వంత్‌ను రూమ్‌మేట్లువెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తరువాత సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి జశ్వంత్ కన్నుమూసాడు.

మెట్రో -- ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించాం

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:

మెట్రో -- ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించాం. రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం. రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర రూ.400 నుంచి రూ.275కు తగ్గించాం. నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర రూ.8,500 నుంచి రూ.4,000కు తగ్గించాం. నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతోంది. రోజువారీ పాస్ వినియోగదారులకు రూ.125 మేరకు ప్రయోజనం కలుగుతోంది. రోజువారీ పాస్‌లో మెట్రోకు రూ.200, ఆర్టీసీకి రూ.75 కేటాయించాం.

రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి వుంటుంది. నెలవారీ పాస్‌లో మెట్రోకు రూ.3,000, ఆర్టీసీకి రూ.1,000 కేటాయించాం. నెలలో గరిష్టంగా 50 మెట్రో సింగిల్ ట్రిప్పులకు అనుమతి వుంటుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఎలాంటి పరిమితులు లేవు. నవంబర్ 8 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి వస్తోంది. ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని అయన అన్నారు.

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

కరీంనగర్, నవంబర్ 6, పెన్ పవర్:
రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయంలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి.అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి.ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త జోష్ వస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై, వైఫల్యాలపై పోరాటాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడం ద్వారా పార్టీ సామాజిక వర్గాల సమీకరణలోనూ బలపడే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.మొత్తానికి రాబోయే స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ హైకమాండ్ తీసుకునే ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు.ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా..
మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు.ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. దక్షిణం వైపు స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రాకపోకల విభాగాలు, ప్రయాణికుల రాక, బయలుదేరే ప్రాంతాల నిర్మాణం పూర్తయింది. దక్షిణం వైపు బేస్‌మెంట్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైలు, మెట్రో, రోడ్డు రవాణా మధ్య అనుసంధానం మరింత మెరుగుపడటంతోపాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి లభించనుంది.

భాగ్యనగర్ లో నీటి కష్టాలు



హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:
హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది.హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్
అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.
తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్ నవంబర్ 6, పెన్ పవర్:
వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి.ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని జజూ స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

ఓలా, ఉబర్ లకు దీటుగా విన్ గ్రూప్

హైదరాబాద్, నవంబర్ 6, పెన్ పవర్:
తెలంగాణాలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉదాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?

నల్గొండ నవంబర్ 6, పెన్ పవర్: నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది.నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ--జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవ

అశోక్‌నగర్, నెహ్రూనగర్‌లో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు

పెండింగ్ పనులపైనా అధికారులకు కాంగ్రెస్ సీనియర్ నేత కౌకుట్ల రూపేందర్ రెడ్డి వినతి



కాప్రా పెన్ పవర్, నవంబర్ 6: ఉప్పల్ నియోజకవర్గం హెచ్‌బీ కాలనీ 19వ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, నెహ్రూనగర్ బ్లాక్-1, 2, 3 ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుట్ల రూపేందర్ రెడ్డి జలమండలి డిజిఎం వేణు గోపాల్, ఏఈ రోహిత్ ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా అశోక్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి గత నెలలోనే డీజీఎం వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తాజాగా అశోక్‌నగర్‌తో పాటు నెహ్రూనగర్ బ్లాక్-1, 2, 3 ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటు, పెండింగ్ పనులను పూర్తి చేయాలని మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అధికారులు సానుకూలంగా స్పందించి ఈ నెలలోనే కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రూపేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన కోరారు.

నెహ్రూ నగర్‌లో నూతనంగా శరత్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ప్రారంభం

ఆధునిక వైద్య సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి రావాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 6: ఖమ్మం నగరంలోని నెహ్రూ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శరత్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఎముకలు, కీళ్లు, వెన్నెముక సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్యం అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వైద్య రంగంలో ఆధునిక సాంకేతికత ఎంత ముఖ్యమో, రోగుల పట్ల వైద్యుల నమ్మకం, మానవత్వం, సేవాభావం కూడా అంతే ముఖ్యమని అభిప్రాయపడ్డారు.నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం సందడిగా సాగింది. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అతిథులకు స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఈ ఆసుపత్రి ద్వారా ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ల విభజనపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం
ఎదులాపురంలో కేక్ కట్ చేసి సంబరాలు.. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 6: ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోతు కిషోర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించేందుకు కమిషన్ల విభజన దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆయా వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
అలాగే పాలేరు నియోజకవర్గానికి చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించడం ప్రాంత ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ధారావత్ రామ్మూర్తి, మూడ్ రామ్మూర్తి, ఎస్టీ సెల్ అధ్యక్షులు కిషన్ నాయక్, పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిరణ్, ఎదులాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్లు బానోతు నాగేంద్ర ప్రసాద్, దివ్య, పుల్చంద్, భాస్కర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్, అజ్మీర అశోక్, బీసీ సెల్ అధ్యక్షులు వెంపటి రవి, ధారావత్ నారాయణ, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రేభ గుండ్ల గోపి, ఐదో వార్డు అధ్యక్షులు బొల్లంకొండ వెంకన్న, రామాచారి, వాసుదేవాచారి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం







- రూ.7 కోట్లతో ఆధునిక క్రీడా, ఆరోగ్య సదుపాయాలు
- ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
- కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరు
- స్థానిక యువతకు ఉపాధి కల్పనలో పరిశ్రమలు ప్రాధాన్యత ఇవ్వాలి: మంత్రి

కాప్రా, పెన్ పవర్, నవంబర్ 6:
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఆధునిక క్రీడా, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. చర్లపల్లి చర్లపల్లి నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రీయల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫెజ్ 2లో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆధునిక జిమ్, ఈఎస్ఐ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న చర్లపల్లి ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు యువతకు క్రీడా అవకాశాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు యువతలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

పరిశ్రమలు.. స్థానిక యువతకు ఉపాధి

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 80వేల నుండి వేల 90వేల మందికి ఉపాధి లభిస్తుందని, భవిష్యత్తులో ఈ సంఖ్యను రెండు లక్షలకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగాలని పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. పారిశ్రామిక ప్రగతి ఫలాలు స్థానిక ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

యువతకు ఎంతో ఉపయోగకరం: ఎంపీ ఈటల రాజేందర్

మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఆధునిక క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. యువత క్రీడల వైపు ఆసక్తి చూపేలా ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి మౌలిక వసతులు దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా మల్కాజిగిరి పరిధిలో పెరుగుతున్న జనాభా నగరికరణకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు 24 రైల్వే బ్రిడ్జిలు మంజూరు చేసినట్లు కార్యక్రమంలో తెలిపారు.స్థానిక అభివృద్ధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చర్లపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. క్రీడా, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ద్వారా స్థానిక యువతతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. విఆర్ ఇంజనీరింగ్ వర్క్స్ రాము నేతృత్వంలో పారిశ్రామికవేత్తల సహకారంతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాక్స్ క్రికెట్, నెట్ క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, పికిల్‌బాల్ కోర్టు, ఆధునిక జిమ్, సమావేశ మందిరం తదితర సదుపాయాలు ఏర్పాటు చెయ్యడం అభినందినియమన్నారు. రూ.7 కోట్లతో నిర్మించిన జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆధునిక క్రీడా, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడంతో చర్లపల్లి, పరిసర ప్రాంతాల యువతకు మెరుగైన వేదిక లభించినట్లయిందన్నారు.పారిశ్రామిక అభివృద్ధితో పాటు క్రీడా, ఆరోగ్య రంగాల్లోనూ చర్లపల్లి మరింత అభివృద్ధి చెందేందుకు ఈ సదుపాయాలు దోహదపడనున్నాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఐల చైర్మన్ డాక్టర్ కె.గోవింద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తాటి శ్రీనివాస్, తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 6: ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సొసైటీ, న్యూఢిల్లీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా నియమితులైన కర్నాటి వజ్రమ్మ వెంకటేశంను నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్నాటి వజ్రమ్మ వెంకటేశంను శాలువాతో ఘనంగా సత్కరించారు. చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. చేనేత కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తూ వారి సంక్షేమానికి మరింత సేవ చేయాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో చిటిపోలు పద్మ లక్ష్మీనారాయణ,చిటిపోలు ఇందిరా సత్యనారాయణ, చిటిపోలు రమేష్, చిటిపోలు అనిత సురేష్, జెల్ల పద్మ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్లతో పాటు మైసమ్మ గుడి సమీపంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



ఖమ్మం, పెన్ పవర్,నవంబర్ 6 : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 13వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మైసమ్మ గుడి సమీపంలో బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, 7, 8, 9వ వార్డుల కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యాదవ మహిళా శక్తి బలోపేతమే లక్ష్యం

ఆవుల స్వరూప యాదవ్‌కు రాష్ట్ర మహిళా సెక్రటరీగా నియామకం

నియామక పత్రం అందజేసిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 6:
అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా సెక్రటరీగా ఆవుల స్వరూప యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రాన్ని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. మహిళలు కేవలం కుటుంబానికే పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
యాదవ మహిళా శక్తిని మరింత బలోపేతం చేయడంతో పాటు, యాదవ మహిళలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఆవుల స్వరూప యాదవ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మహాసభ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఆమెకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీలో సివంగులు.. వదల్లేదుగా.. !



తాజా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ మహిళా నేతలు తమ సత్తా చాటారు. కడపలో ఎమ్మెల్యే ఆర్. మాధవి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు చురుగ్గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మంత్రి సవిత అనంతపురం జిల్లాలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేశారు. చంద్రగిరిలో పులవర్తి సుధ పోలింగ్ సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అనుసరిస్తూ వ్యవహరించిన తీరు కూడా చర్చనీయాంశమైంది.

కూటమి పార్టీల్లో కీలకమైన టీడీపీలో మహిళా నేతల దూకుడు మరోసారి చర్చకు వచ్చింది. 2024 ఎన్నికల సమయంలో విజయం దక్కించుకున్న మహిళా నాయకులు.. పార్టీని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు పురుష నేతల కంటే కూడా ఎక్కువగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నించారు. అదేసమయంలో ఏ ఎన్నికలు వచ్చినా.. మేమున్నామని నిరూపిస్తున్నారు. తాజాగా జరిగిన మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పురుష నేతల ప్రభావం ఒకవైపు ఉన్నా.. మరోవైపు టీడీపీ మహిళా నాయకులు కూడా దూకుడు ప్రదర్శించారు.ఆర్.మాధవి: కడప కార్పొరేషన్ సహా.. తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కడప ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డప్పగారి మాధవి రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ పార్టీతో పాటు తన హవాను కూడా పెంచుకునేందు కు ఆమె చేసిన ప్రయత్నం ఫలించింది. నియోజకవర్గంపై పట్టును కొనసాగించే క్రమంలో వైసీపీ నేతలకు కౌంటర్‌గా బలమైన అభ్యర్థుల ఎంపిక నుంచి ఆమె ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఫైర్ బ్రాండ్ నాయకురాలు కావడంతో నియోజకవర్గంలో ఆమె మాటే చెల్లుబాటు అయింది. ఇక, ఎన్నికల వేళలో ప్రత్యర్థులను కట్టడి చేసే విషయంలోనూ మాధవి దూకుడుగానే వ్యవహరించారు.సవిత: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సంజీవరెడ్డిగారి సవిత.. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. కానీ.. ఆమె ఆది నుంచి కూడా.. జిల్లాపై బలమైన ముద్ర వేసే ప్రయత్నం చేశారు. తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకునే విషయంలో సవిత తనదైన దూకుడు ప్రదర్శించారు. ఫైర్‌బ్రాండ్ నాయకురాలు కాకపోయినా.. వివాదాలకు దూరంగా ఉన్నా.. ప్రజలను ఆకర్షించే విషయంలోను.. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వివరించి ప్రజల ఓటు బ్యాంకును సానుకూలంగా మార్చుకునే విషయంలోనూ మంత్రి సవిత తనదైన ముద్ర వేసుకుని చాలా మునిసిపాలిటీల్లో క్లీన్‌స్వీప్ చేశారు.పులవర్తి సుధ: పార్టీ పరంగా టీడీపీలో కీలక పోస్టు లేకపోయినా.. చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నానీ సతీమణిగా .. జిల్లాలో పేరు తెచ్చుకున్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తనదైన చాతుర్యంతో కట్టడి చేశారు. రిగ్గింగులు, ఘర్షణలు జరగకుండా.. ఆయనను అనుసరిస్తూ.. జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించిన సుధా రెడ్డి, ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో "చెవిరెడ్డి ఎక్కడికి వెళ్తే అక్కడికి తన వాహనంలో వెంబడిస్తానని, ఆయన వెంటే ఉంటానని" హెచ్చరించి రాజకీయంగా సంచలనం సృష్టించారు. ఇలా.. అనేక మంది మహిళా నాయకులు టీడీపీలో విశేషంగా కృషి చేయడం గమనార్హం.

జనం పట్టుబడితే అంతే.. ఏపీలో పోలింగ్ బహిష్కరణ!



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు పలు గ్రామాల ప్రజలు దూరంగా నిలిచారు. రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదాలపై నిరసనగా సామూహికంగా ఎన్నికలను బహిష్కరించారు. విశాఖ, చిత్తూరు, అనంతపురం, అల్లూరి, తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఈ నిరసనలు కనిపించాయి. కొన్ని చోట్ల గ్రామంలోని ఓటర్లంతా ఓటింగ్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అధికార కూటమి, సహా ఇతర పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్రంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యల కారణంగా బహిష్కరిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రాంతాల్లో కనీస సౌకర్యాల లేమి, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదం, తారు రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఓటర్లు పోలింగ్ ప్రక్రియకు దూరంగా నిలిచారు.

ఎక్కడెక్కడ?

1) విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాయనిపేట గ్రామంలోని చెరువు కాలుష్య సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్ల తరబడి శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఇక్కడి ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మొత్తం 120 ఓట్లకు గాను ఓటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు.

2) చిత్తూరు జిల్లాలోని ఐరాల మండలం అబ్బగుండు గ్రామానికి కనీస రహదారి సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రం వంటి కనీస వసతులు కల్పించలేదని నిరసిస్తూ ఇక్కడి ప్రజలు ఓటింగ్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారు. వాటిపై హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3) అనంతపురం జిల్లాలోని నెరమెట్ల గ్రామంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రామానికి చెందిన ప్రజలు కూడా ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరిస్తూ సామూహిక నిర్ణయం తీసుకున్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, ఉపాధి కల్పన వంటివాటిని పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

4) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, గన్నేరు పుట్టు పంచాయితీ, గొప్పు గరువు, పొర్లు గ్రామాల గిరిజనులు సరైన రోడ్డు సౌకర్యం లేదని, జబ్బులు జ్వరాలు వస్తే ప్రాణాలు పోతున్నాయని, వైద్యం, విద్యా, రవాణా లేకా అవస్తలు పడుతున్న ప్రభుత్వం,అధికారులు ,ప్రజా ప్రతినిధులు పట్టించు కోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తమ ప్రాంతానికి తారు రోడ్డు మంజూరు అయ్యేంత వరకు ఎన్నిక ల్లో పాల్గొన బోమని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు బహిష్కరిస్తునట్లు ప్రకటించారు.

5) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మామిడిగుంట ఎస్సీ కాలనీ ఓటర్లు ఎప్పటి నుంచో సమీపంలోనే ఉన్న పిల్లమేడు కేంద్రంలో ఓటు వేస్తున్నారు. అయితే.. ఈసారి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న దయనేడు కేంద్రానికి మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. అంత దూరం వెళ్లలేమంటూ.. పోలింగ్‌ను బహిష్కరించారు.

6) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని వినాయకపురం గ్రామం: దాదాపు 40 ఏళ్లుగా కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాన్ని అకస్మాత్తుగా మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు స్వచ్ఛందంగా పోలింగ్ ప్రక్రియకు దూరంగా ఉండిపోయారు.

7) అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలంలోని రొంగలివానిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్‌ను తొలుత బీసీకి కేటాయించి, ఆ తర్వాత మార్పులు చేయడంపై గ్రామస్థుల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలోని సుమారు 800 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా బహిష్కరించారు.

'గ్రేటర్' విశాఖలో జనసేన సునామీ... !



గ్రేటర్ విశాఖపట్నంలో జనసేన తన బలాన్ని గణనీయంగా పెంచుకుంది. 2021 స్థానిక ఎన్నికల్లో 58 వార్డులకు పోటీ చేసి కేవలం 3 స్థానాలే గెలిచిన పార్టీ.. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 32 వార్డుల్లో పోటీ చేసి 25 చోట్ల విజయం సాధించింది. దక్షిణ విశాఖ, అనకాపల్లి, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో మంచి ఫలితాలు సాధించింది. ఈ విజయంతో ఉత్తరాంధ్రలో పార్టీ విస్తరణకు మరింత ఊతం లభించనుందని జనసేన నేతలు భావిస్తున్నారు.

గ్రేటర్ విశాఖపట్నంలో జనసేన సునామీ సృష్టించింది. నిజానికి ఉత్తరాంధ్రపై కూటమి పట్టుబిగించింది. దీనిలో నూ జనసేన గత 2019 ఎన్నికలతో పోల్చుకుంటే.. ఇప్పుడు మరింతగా విశాఖపై పట్టు పెంచుకోవడం గమనార్హం. అప్పట్లో పవన్ గాజువాక నుంచి ఓడిపోయిన దరిమిలా.. పార్టీ పుంజుకునే విషయంపై చర్చసాగింది. పైగా అదే ఎన్నికల్లో జనసేన విశాఖ నుంచి పోటీ చేసి కూడా.. పరాజయం పాలైంది. దీంతో గ్రేటర్ విశాఖలో గ్లాసు పరిస్థితి సమస్యగా మారింది. కానీ.. అక్కడే ఇప్పుడు పార్టీ పుంజుకోవడం గమనార్హం.

వాస్తవానికి జనసేన 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ పెద్దగా పోటీ ఇవ్వలేక పోయింది. అప్పట్లో పవన్ కల్యాణ్ పోటీ చేసేవారు చేసుకోండి అనిపిలుపునిచ్చి వదిలేశారు. దీంత 58 వార్డుల్లో జనసేన నాయకులు పోటీ చేయగా.. కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులు మాత్రమే గెలిచారు. కానీ.. దీనికి భిన్నంగా 2024 ఎన్నికల నుంచి కూడా జనసేన విశాఖలో పుంజుకోవడం ప్రారంభించింది. ఒక ఎమ్మెల్యే స్థానంతో పాటు తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లోనూ జనసేన దూకుడు చూపింది.ప్రస్తుతం మిత్రపక్షాల తరఫున 32 వార్డుల్లో పోటీ చేసింది. అయితే.. కొన్ని కొన్ని మినహా అన్ని చోట్లా జనసేన విజయం దక్కించుకుంది. ఇది ఆ పార్టీకి మంచి ఊపును తెచ్చే వ్యవహారంగానే నాయకులు చెబుతున్నారు. అంతేకాదు.. భవిష్యత్తులోనూ ఉత్తరాంధకు కీలకమైన గ్రేటర్ విశాఖలో పార్టీ పుంజుకునేందుకు.. మరింతగా పార్టీ విస్తరించేందుకు కూడా ఇది దోహద పడుతుందని అంటున్నారు. పైగా ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖలో పార్టీ పుంజుకోవడం ద్వారా.. అధికారంలోకి రావడం కూడా సునాయాసం అవుతుందని లెక్కలు వేస్తున్నారు.

ఎక్కడెక్కడ గెలిచారంటే..

1) విశాఖ దక్షిణంలో 8 వార్డుల్లో పోటీ చేసి 1 వార్డు మినహా మిగిలిన 7 గెలుచుకున్నారు.

2) గాజువాకలో 6 వార్డుల్లో పోటీ చేయగా, 4 చోట్ల విజయం సాధించింది.

3) అనకాపల్లి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేయగా, మూడింటిలో గెలిచింది.

4) భీమిలి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేసి రెండింటిలో గెలిచారు.

5) పెందుర్తి పరిధిలో రెండు చోట్ల పోటీ చేసిన రెండూ సొంతం చేసుకున్నారు.

6) విశాఖ తూర్పులో 4 చోట్ల పోటీ చేసి రెండు గెలిచారు.

7) పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మూడు వార్డుల్లో పోటీ చేసి 3 కైవసం చేసుకున్నారు.

8) ఉత్తర నియోజకవర్గంలో 3 వార్డులు కేటాయించగా ఒకటి మినహా మిగిలిన 2 చోట్ల గెలిచారు.

'రాధా-రంగా' మిత్రమండలికి జోష్.. !



విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు 2,65,968 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. మొత్తం 86 డివిజన్లలో కూటమి 76 స్థానాలు గెలుచుకుంది. రాధా పుట్టినరోజునే ఫలితం రావడంతో రాధా-రంగా మిత్రమండలి అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) రికార్డు స్థాయి మెజారిటీతో మేయర్‌గా ఘనవిజయం సాధించడంతో రాధా-రంగా మిత్రమండలి లో పండగ వాతావరణం నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత వంగవీటి కుటుంబానికి లభించిన ఈ భారీ విజయం రంగా రాజకీయ వారసత్వాన్ని విజయవాడలో తిరిగి బలంగా నిలబెట్టిందని అభిమానులు మురిసిపోత్న?నారు. కూటమి తరపున జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన వంగవీటి రాధాకృష్ణ.. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. రాధాకృష్ణకు మొత్తం 2,65,968 ఓట్లు రాగా, రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. ఇక, నవంబర్ 4న ఓట్ల లెక్కింపు పూర్తి కావడం, అదే రోజు వంగవీటి రాధాకృష్ణ పుట్టినరోజు కావడంతో అభిమానుల ఆనందం రెట్టింపయింది. కేవలం మేయర్ స్థానమే కాకుండా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. గత అక్టోబర్‌లో వంగవీటి రాధాకృష్ణతో పాటు రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అధికారికంగా జనసేన పార్టీలో చేరారు.ఇప్పుడు సాధించిన ఈ ఘనవిజయంతో రాధా-రంగా మిత్రమండలి బెజవాడ రాజకీయాల్లో తమ పట్టును చాటుకుంది. పాతికేళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణ ప్రస్తుతం 47 ఏళ్ల వయసులో విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. మరీ ముఖ్యంగా వంగవీటి మోహనరంగా 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలవగా.. రంగా హత్యానంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన భార్య రత్నకుమారి అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తండ్రి కార్పొరేటర్‌గా..

వంగవీటి మోహనరంగా 1985లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు అయితే అంతకుముందు 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన కృష్ణలంక 40వ డివిజన్లో కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. ఇప్పుడు ఆయన కుమారుడు రాధా విజయవాడ నగరానికి మేయరుగా ఎన్నికకావడం గమనార్హం. ఇక, ఈ పరిణామంతో ఈ కుటుంబానికి అత్యంత కీలకమైన రాధా-రంగా మిత్రమండలి పుంజుకుంటుందని అనడంలో సందేహం. ఈ మిత్ర మండలి.. సేవా కార్యక్రమాలతోపాటు.. రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు ఉంది.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

విజయవాడ, నవంబర్ 6, :

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజుజ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, ఛైర్‌పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు, నవంబర్ 6, :

రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

జీడీపీ పెరిగితేనే అభివృద్ధి చెందినట్టా?

అసలైన ప్రగతి అంటే ఇదే!



దేశ ఆర్థికాభివృద్ధిని జీడీపీ వృద్ధి రేటుతో మాత్రమే కొలవలేము. పరిశ్రమలు, పెట్టుబడులు, వ్యాపారాలు పెరిగినా ఆ సంపద సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ చెప్పినట్లు విద్య, వైద్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాన అవకాశాలు కూడా అభివృద్ధిలో కీలకం. నిరుద్యోగం, పేదరికం తగ్గి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందినప్పుడే ఆర్థిక వృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది. దేశం ఎంత సంపాదించిందన్నదానికంటే, ఆ సంపదతో సామాన్యుడి బతుకు ఎంత మెరుగుపడిందన్నదే అసలైన అభివృద్ధికి కొలమానం.ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో చెప్పడానికి జీడీపీ వృద్ధి రేటును ప్రధానంగా చూస్తారు. పరిశ్రమలు పెరగడం, పెట్టుబడులు రావడం, వ్యాపారాలు విస్తరించడం ఆర్థికంగా మంచి పరిణామాలే. కానీ ఈ లెక్కలతోనే ప్రజల జీవితాలు బాగుపడ్డాయని చెప్పలేం. ఎందుకంటే దేశ సంపద పెరిగినా సామాన్యుడి కష్టాలు తగ్గకపోతే ఆ అభివృద్ధికి పూర్తి అర్థం ఉండదు.

సంపద పెరిగితే సమస్యలు తీరినట్టేనా?

డబ్బు మనిషి జీవితంలో ముఖ్యమైనది. మంచి చదువు, వైద్యం, ఆహారం, ఇల్లు వంటి అవసరాలు తీర్చుకోవడానికి ఆదాయం అవసరం. అయితే సంపద కొద్దిమంది దగ్గరే పేరుకుపోతే సమాజంలో అంతరం పెరుగుతుంది. ఒకవైపు కోట్లు సంపాదించే వ్యక్తులు ఉంటే, మరోవైపు రోజువారీ అవసరాల కోసం ఇబ్బందులు పడే కుటుంబాలు ఉంటాయి. ఈ పరిస్థితి మారినప్పుడే ఆర్థిక వృద్ధికి నిజమైన విలువ ఉంటుంది.

మనుషుల జీవితాలే అసలైన కొలమానం

నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఆలోచనల ప్రకారం ప్రజలకు మంచి ఆదాయం ఉండటమే కాదు, తమ జీవితాలను మెరుగుపరుచుకునే అవకాశాలు కూడా ఉండాలి. ఉద్యోగాలు, నాణ్యమైన పాఠశాలలు, అందుబాటులో వైద్యం ప్రతి ఒక్కరికీ చేరాలి.

ప్రభుత్వాల ముందున్న బాధ్యత

పరిశ్రమలు, రహదారులు, ఐటీ రంగం ఎంత పెరిగినా నిరుద్యోగం, పేదరికం తగ్గకపోతే అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. అందుకే ప్రభుత్వాలు సంపద సృష్టితో పాటు ప్రజల సంక్షేమంపైనా దృష్టి పెట్టాలి. దేశం ఎంత సంపాదించిందన్నది ఒక లెక్క. ఆ సంపదతో సామాన్యుడి బతుకు ఎంత మారిందన్నదే అసలైన అభివృద్ధి.

నచ్చిన టైం వేస్తామంటే కుదరదు బాస్: సుప్రీంకోర్టు



అరెస్టు చేసిన సమయం విషయంలో పోలీసులు ఇష్టానుసారంగా రికార్డులు మార్చేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుడిని ఏ క్షణంలో అదుపులోకి తీసుకున్నారో అప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని తేల్చిచెప్పింది. అరెస్టు వివరాలను ఆలస్యంగా నమోదు చేసి, తమకు అనుకూలమైన సమయం చూపించడం చట్టవిరుద్ధమని పేర్కొంది. నిందితుడిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని, ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని దేశవ్యాప్తంగా పోలీసులకు స్పష్టం చేసింది.దేశవ్యాప్తంగా పోలీసులను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా కేసులో నిందితులను అరెస్టు చేసినప్పుడు.. పోలీసులు నమోదు చేసే సమయం విషయంపై కోర్టు తీవ్రంగా స్పందించింది. --అరెస్టు చేసిన తర్వాత.. 24 గంటల్లోగా మేజిస్ట్రేటు ముందు హాజరుపరచాలి.---అనే ప్రొసీడింగ్స్ ను పోలీసులు పాటించే విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని పేర్కొంది. దీనిని ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేది లేదని పేర్కొంది.

అరెస్టు చేసిన తర్వాత.. కొన్ని గంటలు లేదా.. రోజుల పాటు ఆ విషయాన్ని దాచి పెట్టి.. తమకు వీలైన సమయాన్ని నమోదు చేసి.. అక్కడి నుంచి 24 గంటలలోగా కోర్టులో హాజరు పరచడం అంటే.. క్రిమినల్ ప్రొసీజరీ కోడ్ సహా.. సహ జ న్యాయసూత్రాలు, వ్యక్తిగత హక్కులు, మానవ హక్కులను కూడా హరించడమేనని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి సంకుచిత వ్యవహారాలకు తావు లేదని పేర్కొంది. మీరు నచ్చిన సమయాన్ని వేసి.. అక్కడ నుంచి 24 గంటలు లెక్కించుకునేందుకు చట్టం అనుమతించదని స్పష్టం చేసింది.నిందితుడిని ఏక్షణంలో అదుపులోకి తీసుకున్నారో.. ఆ క్షణం నుంచి 24 గంటలు వర్తిస్తాయని సుప్రీంకోర్టు పేర్కొం ది. అదుపులోకి తీసుకోవడం.. జరిగిపోయాక.. కొన్ని రోజులు గడిచిన తర్వాత.. అరెస్టును చూపించడం కూడా నేరమేనని స్పష్టం చేసింది. ఇలా చేయడానికి వీల్లేదని పేర్కొంది. నిందితుడిని ఇంట్లో అదుపులోకి తీసుకున్నా.. మరెక్కడ అదుపులోకి తీసుకున్నా.. ఆ క్షణమే అరెస్టు అయినట్టుగా పరిగణించి 24 గంటల్లోనే మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచాలని తేల్చి చెప్పింది.

అయితేఈ ప్రక్రియలో అరెస్టు చేసిన స్థలానికి.. మేజిస్ట్రేట్ కార్యాలయం, లేదా కోర్టుకు మధ్య దూరం ఎక్కువగా ఉంటే.. ఆ ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించేందుకు అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. త్రిపుర రాష్ట్రానికి సంబంధించిన కేసు విషయంలో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే.. దేశవ్యాప్తంగా అరెస్టులు, అదుపులోకి తీసుకునే విషయంలో ఈ నియమమే వర్తిస్తుందని కోర్టు తెలిపింది.

స్వీట్లు కాదు.. ఈ దీపావళికి మీ వాళ్లకు జీవితాంతం గుర్తుండిపోయేలా ఇచ్చే బెస్ట్ గిఫ్ట్స్!



పండుగ సంబురం రెట్టింపు అవ్వాలంటే మనవాళ్లతో కలిసి జరుపుకోవాలి.. ఇల్లు, పిల్లలు, బంధుమిత్రులంతా ఒక చోట చేరితేనే అసలైన పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ పండుగ వేళ ఆత్మీయులతో ఊసులూడుకోవడమే కాకుండా, మన ప్రేమాభిమానాలకు గుర్తుగా బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఇక ఈ దీపావళికి మీ అయినవాళ్లకు ఇవ్వడానికి కొన్ని ప్రత్యేకమైన, యూనిక్ గిఫ్ట్ ఐడియాస్ మీకోసం..

దీపావళికి బంధుమిత్రులకు హ్యాండ్‌లూమ్ (నేత) దుస్తులను కానుకగా ఇస్తే చాలా యూనిక్‌గా ఉంటుంది.

: ఇవి తొడుక్కుంటే ఒంటికి ఎంతో హాయిగా, సౌకర్యవంతంగా ఉంటాయి.

సాంప్రదాయ లుక్: ట్రెడిషనల్ వేడుకలకు హ్యాండ్‌లూమ్ వస్త్రాలు ఇచ్చే రాయల్ అండ్ క్లాసీ లుక్ వేరే దేనికి రాదు.

లక్ష్మీ-గణపతి విగ్రహాలు

దీపావళి పర్వదినాన శ్రీలక్ష్మీ దేవిని, విఘ్నేశ్వరుడిని పూజించడం అనవాయితీ.

పూజా అలంకరణ: బంధువులు తమ ఇంట్లో పూజ చేసుకోవడానికి లేదా దేవుడి గదిని అలంకరించుకోవడానికి చిన్న సైజ్ లక్ష్మీదేవి, గణపతి విగ్రహాలను బహుమతిగా ఇవ్వొచ్చు.

శుభసూచకం: ఈ విగ్రహాలను కానుకగా ఇవ్వడం వల్ల వాళ్ల ఇంట్లో శుభాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని నమ్ముతారు.

సీడ్ గ్రీటింగ్ కార్డ్స్

ప్రస్తుతం మార్కెట్‌లో పర్యావరణహితమైన ప్రత్యేకమైన సీడ్ కార్డ్స్ అందుబాటులో ఉన్నాయి.

నేచర్ ఫ్రెండ్లీ: ఈ కార్డులపై శుభాకాంక్షలు తెలుపుతూనే, దీపాల కాంతులతో వేడుక పూర్తి చేసుకున్నాక.. ఈ కార్డును కుండీలో లేదా మట్టిలో పాతేసి నీళ్లు పోస్తే అందమైన మొక్క మొలుస్తుంది.

గుర్తుండిపోయే కానుక: కార్డు పాతేసిన కొద్ది రోజులకే మొక్కగా ఎదుగుతుంటే.. మీ బహుమతి వాళ్ల మనసులో పచ్చగా, జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ దీపావళికి ఇలాంటి పర్యావరణహితమైన, సాంప్రదాయ బహుమతులతో మీ ఆత్మీయుల ఇళ్లలో వెలుగులు నింపండి.

AIతో ముసలి వయస్సులో ఆరోగ్యంపై పరిశోధనలు

లక్నో యూనివర్సిటీకి కోట్ల నిధులు



వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఈ మార్పులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. జ్ఞాపకశక్తి తగ్గడం, మతిమరుపు, డైమెన్షియా, నాడీ సంబంధిత సమస్యలు, జీర్ణక్రియలో ఇబ్బందులు, జీవక్రియ మందగించడం వంటి సమస్యలు వృద్ధులను వేధిస్తుంటాయి. అయితే ఈ సమస్యలను ముందుగానే గుర్తించి, ఆరోగ్యకరమైన వృద్ధాప్యాన్ని ప్రోత్సహించే మార్గాలను కనుగొనే దిశగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) కీలక పరిశోధనకు శ్రీకారం చుట్టింది.లక్నో విశ్వవిద్యాలయం నేతృత్వంలోని పరిశోధన బృందానికి ఐసీఎంఆర్ అన్వేషణ్ కార్యక్రమం కింద రూ.2 కోట్ల గ్రాంటు మంజూరు చేసింది. ఈ పరిశోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ప్రేగులు -మెదడు మధ్య సంబంధంపై అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా న్యూరోపెప్టైడ్స్ అనే జీవసంబంధ సంకేతాల ద్వారా వృద్ధాప్యంలో మెదడు, జీర్ణవ్యవస్థ పనితీరులో వచ్చే మార్పులను గుర్తించనున్నారు.ఈ పరిశోధన విజయవంతమైతే వృద్ధాప్యంలో వచ్చే డైమెన్షియా, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి సమస్యల ప్రారంభ జీవసంబంధ గుర్తులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రేగుల ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకుని కొత్త నివారణ, చికిత్సా విధానాల అభివృద్ధికి మార్గం దొరుకుతుంది. దీంతో వృద్ధాప్యంలో వ్యాధుల ముప్పును తగ్గించి, మెరుగైన జీవన ప్రమాణాలను అందించేందుకు ఈ పరిశోధన దోహదపడే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

దీపావళి స్పెషల్.. వీకెండ్స్ లో సందడి చేయనున్న సినిమాలు, సిరీస్ లు ఇవే!



దీపావళి పండగ వీకెండ్ సందర్భంగా నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, సోనీ లివ్, జీ5 వంటి ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు వచ్చాయి. తెలుగులో 'బాలు గీత', 'బా బా బ్లాక్ షీప్'తో పాటు 'జురాసిక్ వరల్డ్ రీబర్త్', 'ఐయామ్ గేమ్', 'మినియన్స్ అండ్ మాస్టర్స్' వంటి చిత్రాలు వివిధ భాషల్లో అందుబాటులోకి వచ్చాయి. దీపావళి సెలవుల్లో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి సినిమాలు చూడాలనుకునే వారికి ఈ వారం ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు మంచి వినోదాన్ని అందిస్తున్నాయి. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం మరియు ఇంగ్లీష్ భాషల్లో చాలా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు సిద్ధమయ్యాయి. నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్ వంటి ప్రముఖ వేదికలపై ఈ పండగ వీకెండ్‌లో రాబోతున్న ఆ లిస్ట్ ఇప్పుడు వివరంగా చూద్దాం.

తెలుగు ప్రేక్షకుల కోసం ప్రత్యేక చిత్రాలు:

ఈ వారం తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు రెండు సినిమాలు నేరుగా ఓటీటీలో విడుదలయ్యాయి. ఈటీవీ విన్ వేదికగా 'బాలు గీత' అనే రొమాంటిక్ డ్రామా స్ట్రీమింగ్ అవుతోంది. అలాగే సన్ నెక్స్ట్ లో 'బా బా బ్లాక్ షీప్' అనే క్రైమ్ కామెడీ సినిమా అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు ఇతర భాషల డబ్బింగ్ చిత్రాలు కూడా తెలుగు ఆడియోతో స్ట్రీమింగ్ అవుతున్నాయి.

నెట్‌ఫ్లిక్స్‌లో హాలీవుడ్, బాలీవుడ్ చిత్రాలు:

నెట్‌ఫ్లిక్స్‌లో ఈ పండగకు వరుస సినిమాలు విడుదలయ్యాయి. హిందీ ఫ్యామిలీ డ్రామా 'దిల్వాలి దివాలి', హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీ 'జురాసిక్ వరల్డ్ రీబర్త్' తెలుగులోనూ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 'ఏ డాగ్స్ పర్పెక్ట్ క్రిస్మస్', స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'బ్లాక్ డవ్స్ సీజన్ 2', 'టేకన్: నటాలీ హోలోవే' డాక్యుమెంటరీ, అలాగే పిల్లల కోసం పలు యానిమేషన్ సిరీస్‌లు స్ట్రీమింగ్ అవుతున్నాయి.

ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్ రిలీజ్‌లు:

అమెజాన్ ప్రైమ్ వీడియోలో యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'ది మంగూస్', 'క్యాంపస్ డైరర్స్ సీజన్ 1' తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతున్నాయి. తమిళంలో 'ఆల్ పాస్', 'ఓట్టం తుళ్ళల్', కొరియన్ సిరీస్ 'ది డెవిల్ జడ్జ్' అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు జియో హాట్‌స్టార్‌లో మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్', యానిమేషన్ మూవీ 'మినియన్స్ అండ్ మాస్టర్స్' తెలుగు ఆడియోతో వచ్చాయి. ఇక హిందీలో 'భాయ్ తేరా స్టార్ హై', ఇంగ్లీష్‌లో 'ది గిల్డెడ్ ఏజ్ సీజన్ 4' స్ట్రీమింగ్ అవుతున్నాయి.

సోనీ లివ్, జీ5, సన్ నెక్ట్స్ స్పెషల్స్:

సోనీ లివ్ లో తమిళ కామెడీ డ్రామా 'మీసయ మురుక్కు 2' తెలుగు సహా ఐదు భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. జీ5 లో హిందీ థ్రిల్లర్ 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్', తమిళ రొమాంటిక్ డ్రామా 'నూరు కోడి వానవిల్' ఉన్నాయి. ఇంకా సన్ నెక్ట్స్‌లో 'ది గ్రాండ్ మాస్టర్', మలయాళ థ్రిల్లర్ 'ఐసీయూ', ఆహా తమిళ్‌లో '7 స్టార్ బాయ్స్', ఆపిల్ టీవీలో 'స్టిక్ సీజన్ 2' విడుదలయ్యాయి. ఇక థియేటర్లకు వెళ్లలేని వారికి ఈ వారం ఓటీటీల్లో అన్ని జోనర్ల సినిమాలు అందుబాటులో ఉన్నాయి. మీ అభిరుచికి తగ్గ సినిమాను ఎంచుకుని ఈ పండగ సెలవులను కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేయవచ్చు.

మన అల్లుడే అమెరికా ముస్లిం సెనెటర్.. లింకులు కర్ణాటకలో.. అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలు

అమెరికా రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన అబ్దుల్ ఎల్-సయీద్ విజయానికి కర్ణాటకతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన భార్య సారా జుకా మూలాలు భట్కల్‌కు చెందినవి. కర్ణాటక మాజీ ఉపమంత్రి జె.హెచ్. షంషుద్దీన్ మనవరాలైన సారా.. అబ్దుల్‌కు రాజకీయ ప్రయాణంలో అండగా నిలిచారు. మిచిగాన్ యూనివర్సిటీలో మొదలైన వీరి పరిచయం 2006లో వివాహ బంధంగా మారింది. అమెరికాలో స్థిరపడినా భారతీయ మూలాలను ఈ కుటుంబం మరువలేదు.అరచేతిలో ఇమిడిపోయే ఈ ప్రపంచంలో.. సరిహద్దులు ఎప్పుడో చెరిగిపోయాయి. కానీ కొన్ని విజయాలు మాత్రం ఖండాలు దాటి మన హృదయాలను తాకుతాయి. తాజాగా అమెరికా రాజకీయాల్లో డెమొక్రాట్ అభ్యర్థిగా పోటీచేసిన తొలి ముస్లిం అమెరికన్ అబ్దుల్ ఎల్-సయీద్ సాధించిన విజయం అలాంటి ఒక అద్భుతమైన అనుభూతిని అందిస్తోంది. మిచిగాన్ ప్రజల గుండెల్లో చోటు సంపాదించి సెనెట్‌లోకి అడుగుపెడుతున్న తొలి ముస్లిం నాయకుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. అయితే ఈ చారిత్రాత్మక విజయం వెనుక దక్షిణ భారతదేశంతో.. ముఖ్యంగా కర్ణాటక మట్టితో విడదీయరాని ఓ మమకారపు బంధం ఉందనే విషయం మనకు ఎంతో గర్వకారణంగా మారింది.

అవును.. అమెరికా ప్రజాస్వామ్యంలో సగర్వంగా నిలిచిన ఈ అల్లుడు మన భారతీయుడే.. ఎల్-సయీద్ జీవిత భాగస్వామి సారా జుకాకు మూలాలు కర్ణాటకలోని తీరప్రాంత పట్టణమైన భట్కల్‌లో ఉన్నాయి. జాత్యహంకారం.. మతపరమైన వ్యాఖ్యలు.. విద్వేషపు గోడలను ఎదుర్కొని సాగిన ఈ రాజకీయ పోరాటంలో సారా ఆయనకు కొండంత అండగా నిలిచారు.

ఈ కథ కేవలం రాజకీయాల

గురించే కాదు.. ఒక గొప్ప కుటుంబ వారసత్వం.. ప్రేమ గురించి కూడా.. సారా తాతయ్య జె.హెచ్. షంషుద్దీన్ జుకాకు కర్ణాటక రాజకీయాల్లో ప్రముఖ నాయకుడు.. మాజీ ఉప మంత్రి. ఆయన కుమారుడు డాక్టర్ తయ్యబ్ అంటే సారా తండ్రి బెంగళూరులో వైద్య విద్య పూర్తి చేసి 1980లలో అమెరికాలో స్థిరపడ్డారు. దేశం కాని దేశంలో పెరిగినా సారా కుటుంబం తమ భారతీయ మూలాలను, సంస్కృతిని ఎన్నడూ మరువలేదు. బెంగళూరు, భట్కల్‌లకు తరచూ వస్తూ తమ మట్టితో అనుబంధాన్ని కాపాడుకున్నారు.

మిచిగాన్ యూనివర్సిటీలో విద్యార్థులుగా ఉన్న సమయంలో అబ్దుల్.. సారాల మధ్య చిగురించిన పరిచయం ప్రేమగా మారి 2006లో వివాహ బంధంతో ఒకటైంది. ఈజిప్షియన్ మూలాలున్న అబ్దుల్..

ఈ రెండంకెల సుదీర్ఘ ప్రయాణంలో తాను "భారతీయ కుటుంబానికి అల్లుడిని" అని ఎంతో గర్వంగా చెప్పుకుంటారు.ప్రచార సమయంలో ప్రత్యర్థుల నుంచి ముస్లిం గుర్తింపు ఆధారంగా ఎన్నో విమర్శలు.. హేళనలు ఎదురైనప్పటికీ.. అబ్దుల్ ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగారు. ఓ వైపు సైకియాట్రిస్ట్‌గా సేవలు అందిస్తున్న భార్య సారా.. మరోవైపు ఎపిడమాలజిస్ట్ అయిన అబ్దుల్.. ఇద్దరూ ప్రజారోగ్యం.. సామాజిక శ్రేయస్సే లక్ష్యంగా నిలబడ్డారు.సముద్రాలు దాటినా చెరిగిపోని సంస్కారం.. ఎంత ఎదిగినా మూలాలను మరువని మమకారం కలబోసిన సారా-అబ్దుల్ల ప్రయాణం నేడు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. సరిహద్దులు ఎంత సుదూరమైనా 'మన అనుబంధం' ఎప్పుడూ ప్రత్యేకాలే అని ఈ విజయం మరోసారి నిరూపించింది.

పవన్ కల్యాణ్ కు తప్పుడు నివేదికలు ఇస్తున్నారా?



మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించారు అయినా సరే జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం స్పందించలేదు. ఫలితాలపై ఆయన మౌనంగానే ఉన్నారు. అందుకు గల కారణాలపై పార్టీలోనూ, రాజకీయంగా చర్చజరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ సాధించిన విజయంపై పవన్ కల్యాణ్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈవీఎం, బ్యాలెట్ ఏదైనా విజయం కూటమిదేనని ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిపక్షాలు ఈవీఎంలపై విమర్శలు చేశాయని, అయితే ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించి ప్రతిపక్షాల విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ విజయం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై పట్టణ ఓటర్లు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

100శాతం స్ట్రయిక్ రేట్ పై హర్షం వ్యక్తం చేసినా...

జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ రెండు మేయర్ స్థానాలు, పదిహేను మున్సిపల్ చైర్మన్, 3 నగర పంచాయతీ స్థానాలు కలిపి మొత్తం 20 చోట్ల విజయం సాధించి 100 శాతం స్ట్రయిక్ రేట్ రిపీట్ చేయడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేస్తూ, పట్టణ ఓటర్ల ఆదరణ ఎంతో అమూల్యమైనదని కొనియాడారు.కూటమి అభ్యర్థుల గెలుపునకు రాత్రింబవళ్లు శ్రమించిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మరియు తమపై నమ్మకం ఉంచిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే ఒకింత ఆయనకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు తలనొప్పిగా మారాయని చెప్పాలి. సొంత పార్టీ క్యాడర్, జనసైనికుల నుంచి కొంత అసంతృప్తి ఎదురయింది. అనేక ప్రాంతాల్లో రెబెల్స్ పోటీ చేయడం తోపాటు కూటమిలోని మిత్ర పక్ష పార్టీలే అభ్యర్థులుగా బరిలోకి దిగడం జనసేన ఖరారయిన అభ్యర్థులు గెలిచినా టెన్షన్ పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెబెల్స్ బరిలో దిగి..

కొన్ని చోట్ల తమకు బలమున్న అభ్యర్థులను కూడా ఎంపిక చేయకపోవడాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి కొందరు తీసుకెళుతున్నారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే కూటమి అభ్యర్థులు కాకుండా, రెబెల్స్ గెలవడాన్ని కూడా కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తన సొంత నియోజకవర్గంలోనూ అభ్యర్థుల ఎంపిక సరైన తీరిలో జరగలేదన్న అసహనంతో పవన్ కల్యాణ్ ఉన్నారని తెలిసింది. అలాగే ఆదోని మున్సిపల్ కార్పొరేషన్ విషయంలో బలమున్న నేతను ఎంపిక చేయకపోగా, అది టీడీపీకి వదిలేయడం, జనసేన రెబల్ అభ్యర్థి గెలవడాన్ని కూడా కొందరు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. పవన్ కల్యాణ్ ను కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, బలమైన , గెలిచే స్థానాలు కాకుండా, అభ్యర్థుల ఎంపికలోనూ వారి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ గెలుపుపై మాట్లాడినా అభ్యర్థుల ఎంపిక, జనసేన రెబెల్స్ గెలవడం వంటి అంశాలను సీరియస్ గా తీసుకున్నారని తెలిసింది.

రోకలిబండ ఆయుధం..
బెంగళూరులో ఏడుగురి దారుణ హత్య



బెంగళూరులో దారుణం జరిగింది. క్యాబ్ డ్రైవర్ శేఖర్ ఏడుగురిని చంపినట్లు పోలీసులు గుర్తించారు. భార్య, ఆమె బంధువులతో సహా ఏడుగురిని హత్య చేసినట్లు చెబుతున్నారు. కుటుంబంలో తలెత్తిన విభేదాలతో భార్య, ఆమె కుటుంబాన్ని చంపిన శేఖర్ తర్వాత మృతదేహాన్ని మాయం చేశాడు. ఒకరి తర్వాత ఒకరిని రోకలిబండతో కొట్టి శేఖర్ చంపినట్లు గుర్తించారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. కుటుంబ కలహాలు, భార్య వైపు వారు తమ సంసారంలో జోక్యం చేసుకుంటున్నారనే కక్షతో నిందితుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. రాజాజీనగర్ పరిధిలో జరిగిన ఈ నరమేధానికి సంబంధించి నిందితుడైన ఇందు శేఖర్ అనే క్యాబ్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

భార్య, బంధువులతో సహా...

నిందితుడి భార్య సునీత, అత్త రూపవతి, బావమరుదులు శివకుమార్, శంకర్, తోటికోడళ్లు దివ్య, నలిని, అలాగే శంకర్ కుమారుడైన ఏడేళ్ల బాలుడు పునీత్ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. నిందితుడు ఇందు శేఖర్ పక్కా ప్లాన్ ప్రకారం రెండు రోజుల వ్యవధిలో ఒక్కొక్కరిని తన ఇంటికి పిలిపించి రోకలిబండతో మోది దారుణంగా హతమార్చాడు. మొదట భార్యను చంపి, ఆ తర్వాత మిగతా కుటుంబ సభ్యులను పార్టీ పేరుతో పిలిపించి అంతమొందించాడు.హత్యల అనంతరం ఇంట్లోని రక్తపు మరకలను కెమికల్స్ ఉపయోగించి క్లీన్ చేశాడు. శవాలను తన క్యాబ్ కారులో తరలించి చిక్కబళ్లాపూర్ జిల్లాలోని నంది హిల్స్ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు లోయల్లో పడేసాడు.

వెలుగులోకి వచ్చిందిలా...

నిందితుడి బంధువుల్లో ఒకరైన నళిని కనిపించకుండా పోవడంతో ఆమె తల్లి శ్రీరాంపుర పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇందు శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ సామూహిక హత్యల గుట్టు రట్టయింది. ప్రస్తుతం పోలీసులు నిందితుడిని ఘటనా స్థలాలకు తీసుకెళ్లి మృతదేహాల రికవరీ ప్రక్రియ చేపట్టారు. ఇప్పటివరకు ఏడేళ్ల బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకోగా, మిగిలిన వారి దేహాల కోసం గాలిస్తున్నారు.పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. పోలీసులు ఈ హత్యలకు గల కారణాలపై విచారణ జరుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దీపావళికి ముందే టపాసుల్లా పేలుతున్న పసిడి



ఎఎవతీఎఎస : బంగారం ధరలు మరింత పెరగనున్నాయన్న అంచనాలు నిజమవుతున్నాయి. వరసగా ధరలు పెరుగుతూ కొనుగోలుదారులకు షాకిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో ధరలు పెరగడం ఈ వారంలోనే చూశామని, గత వారం మొత్తం ధరలు తగ్గుతూ ఎంతో కొంత ఊరట కలిగించాయని కొనుగోలుదారులు అంటున్నారు. అయితే అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల ప్రభావంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెటింగ్ నిపుణులు చెబుతున్నారు. ధరల పెరుగుదల ప్రారంభమయిన తర్వాత ఇక తగ్గడం అనేది జరగదన్నది వ్యాపారుల నుంచి వినిపిస్తున్న మాట.

నిన్నటి వరకూ తగ్గి...

పశ్చిమాసియాలో యుద్ధం ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ప్రారంభమయింది. అప్పటి నుంచి పసిడి, రజితం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. హోర్మూజ్ జలసంధిలో చమురు నౌకలను అడ్డుకుంటుండటంతో క్రూడాయిల్ ధరలు ప్రపంచ వ్యాప్తంగా పెరిగాయి. ఈ కారణంతో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పెట్టుబడి పెట్టేవారు సయితం క్రూడాయిల్ పై పెడుతున్నారు. దీంతో పాటు అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి తగ్గుదల, డాలర్ బలపడటం, విదేశాల్లో నెలకొన్న మాంద్యం, బంగారం దిగుమతులపై సుంకాల విధింపు వంటి కారణాలతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. డిమాండ్ కూడా తగ్గింది.

కార్తీక మాసం...

కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో తిరిగి బంగారం, వెండి అమ్మకాలు ఊపందుకోనున్నాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మరొకవైపు శుభకార్యాల సీజన్ కూడా ప్రారంభం కానుండటంతో బంగారం, వెండి క్రయ, విక్రయాలు జోరందుకుంటాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. బంగారం, వెండిపై పెట్టుబడి పెట్టేవారు సయితం ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. వెండి ధరలు తగ్గాయి. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,33,860 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,46,030 రూపాయలకు చేరుకుంది. కిలో వెండి ధర 2,10,100 రూపాయల వద్ద ట్రేడ్ అవుతుంది. మధ్యాహ్నానికి ధరల్లో మళ్లీ మార్పులుండవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఫ్రాన్స్‌లో భారీ నిరసనలు..
6 లక్షల మందికిపైగా రోడ్లపైకి

ఫ్రాన్స్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం పారిస్‌తో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు మద్దతు ప్రకటించారు. దీంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వంపై ఒత్తిడి మరింత పెరిగింది.ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా 6 లక్షల మందికిపైగా ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు. అయితే దేశంలోని ప్రధాన కార్మిక సంఘాల్లో ఒకటైన సీజీటీ మాత్రం 200కు పైగా ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో దాదాపు 16 లక్షల మంది పాల్గొన్నారని వెల్లడించింది. అక్టోబరు 17న జరిగిన నిరసనల కంటే ఈసారి ఎక్కువ మంది రోడ్లపైకి వచ్చారు. అప్పట్లో ఆందోళనల సందర్భంగా విధ్వంసం, దోపిడీలు చోటుచేసుకున్నాయి.పారిస్‌లో ప్రదర్శన ప్రశాంతంగా సాగింది. విద్యార్థులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువ ఆందోళనకారులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'అసమానతలు మా భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి', 'జీవనం సాగించడానికే మా జీవితమంతా గడపలేం' అంటూ నినాదాలు చేశారు.పారిస్‌లో 3.5 లక్షల మంది పాల్గొన్నట్లు సీజీటీ అంచనా వేసింది. ఈ భారీ స్పందన ఉద్యమంలో కొత్త దశకు నాంది పలికిందని పేర్కొంది. తమ డిమాండ్లకు ప్రభుత్వం, యాజమాన్యాలు అంగీకరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది.ఫ్రాన్స్‌లోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు మూడో వంతు మూతపడ్డాయి. కొన్ని చోట్ల విద్యార్థులు పాఠశాలలను దిగ్బంధించగా, మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు సమ్మెకు దిగారు. దీంతో విద్యా సంస్థలు పనిచేయలేకపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజా రవాణా సేవలకు అంతరాయం కలిగింది. ఈఫిల్ టవర్‌ను కూడా మూసివేశారు.

భారీగా పోలీసుల మోహరింపు.. పలుచోట్ల ఉద్రిక్తతలు...

నిరసనలను అదుపు చేసేందుకు 70 వేల మంది పోలీసులను మోహరించినట్లు అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ నూనెజ్ తెలిపారు. సాయుధ వాహనాలు, డ్రోన్లు, హెలికాప్టర్లను కూడా రంగంలోకి దించారు. గతంలో నిరసనకారులపై పోలీసులు అతిగా బలప్రయోగం చేశారన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు.పశ్చిమ ప్రాంతమైన బ్రిటనీలోని రెన్నెస్‌లో ముసుగులు ధరించిన కొందరు రహదారులను దిగ్బంధించేందుకు ప్రయత్నించారని అధికారులు తెలిపారు. యువకులు, కొన్నిచోట్ల వారితో పాటు వచ్చిన పెద్దలు పోలీసులపై స్టీల్ గుండ్లు విసిరి హింసకు పాల్పడ్డారని పేర్కొన్నారు.లియోన్స్, నాంటెస్, పో, ఓర్లియాన్స్, రెన్నెస్, టౌలాస్ నగరాల్లోనూ ఉద్రిక్తతలు, తోపులాటలు, ఇతర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి కనీసం 448 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ వెల్లడించింది.గత కొన్ని వారాలుగా ఫ్రాన్స్‌లో తరచూ భారీ నిరసనలు కొనసాగుతున్నాయి. వీటిలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తిరుగుబాటును రెచ్చగొట్టేందుకు ముసుగులు ధరించిన వామపక్ష తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారని, మరికొందరు దోపిడీలకు పాల్పడుతున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు.

మాంద్యం ముప్పు.. వేతనాలు పెంచాలంటున్న సంఘాలు...

దేశం ఆర్థిక మాంద్యం అంచున ఉందని, ఉద్యోగుల తొలగింపు ప్రణాళికలు పెరుగుతున్నాయని ఫ్రాన్స్‌లోని ప్రధాన కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఇంధనం, ఆహార పదార్థాలు, అద్దెలు, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతున్నాయని.. వేతనాలు, పింఛన్లు మాత్రం పెరగడం లేదని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి.ఫ్రాన్స్ ప్రస్తుతం అప్పుల భారంతో సతమతమవుతోంది. యూరప్‌లో ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లో ఇటలీ, బెల్జియంతో పాటు ఫ్రాన్స్ కూడా ఉందని పేర్కొన్నారు."ఈ దేశంలోని ప్రతి చిన్నారికి మంచి భవిష్యత్తు కల్పించాలి" అని పారిస్ నిరసనలో పాల్గొన్న 21 ఏళ్ల విశ్వవిద్యాలయ విద్యార్థిని గరాన్స్ బ్లేజ్ అన్నారు."మాకు ఉద్యోగం వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయం మా తల్లిదండ్రులకూ తెలుసు. వారు మా అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నారు. వారికి కూడా కొన్ని డిమాండ్లు ఉన్నాయి. ఈ ఉద్యమం ఇప్పటికే యూరప్ అంతటా విస్తరించింది. ఇది కేవలం విద్యార్థుల ఉద్యమం కాదు. ప్రజలందరి ఉద్యమం" అని ఆమె వివరించారు.పారిస్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న కొరిన్ కుచినీ కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, పరికరాల కొరత తీవ్రంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "వేతనాలు పెంచడం, పని పరిస్థితులను మెరుగుపరచడమే మా ప్రధాన డిమాండ్లు" అని ప్రైవేటు హెల్త్‌కేర్ ఫెడరల్ యూనియన్‌కు చెందిన ఆమె చెప్పారు.సుడ్-రైల్ యూనియన్ జాతీయ కార్యదర్శి ఫాబియన్ విల్లియా అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నేతృత్వంలోని ప్రభుత్వంతో పాటు జాతీయ రైల్వే సంస్థ ఎస్ఎన్‌సీఎఫ్‌పై విమర్శలు చేశారు."ప్రభుత్వం, ఎస్ఎన్‌సీఎఫ్ అధిపతి సహేతుకంగా వ్యవహరించనప్పుడు ఫ్రాన్స్‌లో ఎప్పటినుంచో చేస్తున్నట్లే మేం సమ్మెకు దిగుతాం" అని పారిస్‌లోని గార్ దె లియోన్ రైల్వే స్టేషన్ వద్ద ఆయన అన్నారు.సమ్మెకు ముందు ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపింది. నిరసనలు మరింత విస్తరించకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. అయితే ఇటీవలి కాలంలో ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది.

ఏపీ, తెలంగాణలో నేడు కూడా వానలు...మురసు ప్రభావం



ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నేడు కూడా వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. మురసు తుపాను ప్రభావంతో నేడు కూడా కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు, మరికొన్ని చోట్ల తేలికపాటి వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. మరసు తుఫాను ప్రభావంతో నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాతావరణం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఇప్పటికే వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్ల మీద నీరు అలాగే ఉంది. దీంతో వేడినీళ్లు తాగాలని, నీళ్లను కాచుకుని తాగాలని, అప్పుడే అంటు వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే రోగాలు చుట్టుముడతాయని అన్నారు.

నేడు ఏపీలో వానలు...

ఆంధ్రప్రదేశ్ లో నేడు వానలు పడతాయని అమరావతి వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు వానలు, తేలికపాటి వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలు మాత్రం కొన్ని చోట్ల పడతాయని పేర్కొంది. మురసు తుఫాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ, అమరావతి, విజయవాడ, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్ లో ఇంకా కొన్నిచోట్ల విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ కాలేదు. దీంతో చీకట్లోనే కొన్ని గ్రామాలున్నాయి. మరొకవైపు రహదారులు గుంతల మయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

వాతావరణం చల్లబడినా...

తెలంగాణలో వాతావరణం నేడు చల్లగా ఉండనుంది. కొన్ని చోట్ల వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణలో కూడా అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే ఛాన్స్ ఉంది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉండి, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో కొద్దిపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. నిన్న మొన్నటి వరకూ ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. కానీ బంగాళాఖాతంలో ఏర్పడిన వరస తుపానులతో వానలు పడటంతో వాతావరణం చల్లబడింది. మరొకవైపు విద్యుత్తు వినియోగం కూడా తగ్గింది. దీంతో కొంత వరకూ ప్రజలపైనా, ప్రభుత్వంపైన భారం తగ్గుతూ వస్తోంది. నేడు కొన్ని చోట్ల వానలు పడతాయని, రేపటి నుంచి సాధారణంగా వాతావరణం ఉంటుందని తెలిపింది. అయితే ఎగువ రాష్ట్రాలకు కురుస్తున్న భారీ వానలకు నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు.

ఐటీకి ఊరట దక్కేనా?

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు టెక్నాలజీ రంగంలో వాతావరణాన్ని మార్చేశాయి. డెమొక్రాట్లు ప్రతినిధుల సభను, సెనేట్‌ను రెండింటినీ గెలుచుకున్నారు. ఫలితాలను "పూర్తిగా అంగీకరిస్తానని" అధ్యక్షుడు ట్రంప్ న్యూయార్క్ టైమ్స్‌తో అన్నారు. కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపడుతుంది. ఈ మార్పు భారత ఐటీ రంగం, ఉద్యోగుల కళ్లకు ఎందుకు పెద్ద విషయమంటే, ట్రంప్ పాలనలో గడిచిన రెండేళ్లు వారికి కష్టంగా గడిచాయి. 2025 సెప్టెంబర్‌లో కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తుపై ఒక లక్ష డాలర్ల రుసుము విధించడంతో 'నిఫ్టీ ఐటీ' సూచీ ఒక్కరోజే సుమారు 4 శాతం పడిపోయింది; హెచ్-1బీ పొందేవారిలో 71 శాతం భారతీయులే, భారత ఐటీ పరిశ్రమ ఆదాయంలో 57 శాతం అమెరికా నుంచే వస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు, ఇటీవల ఉద్యోగులను తొలగించిన కంపెనీల వీసా దరఖాస్తులను మరింత కఠినంగా పరిశీలించాలని ఏజెన్సీలను ఆదేశించింది. తాజాగా అక్టోబర్ 8న అమెరికా కార్మిక శాఖ, గ్రీన్ కార్డ్ ప్రక్రియలో తొలి మెట్టయిన 'పెర్మ్' (శాశ్వత కార్మిక ధృవీకరణ) కార్యక్రమం నుంచి టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ, అలాగే మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను సస్పెండ్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, కార్మిక మంత్రి కీత్ సొండర్లింగ్ పాల్గొన్న శ్వేత సౌధ విలేకరుల సమావేశంలో ప్రకటించిన ఈ చర్యకు ముగింపు తేదీ లేదు, లిఖితపూర్వక నోటీసు కూడా లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు; ఈ కంపెనీల కొత్త దరఖాస్తులను తీసుకోరు, ఇప్పటికే దాఖలైన వాటి పరిశీలన నిలిచిపోయింది. వీసా ప్రాసెసింగ్‌లో ఆలస్యాలు, గ్రీన్ కార్డ్ దరఖాస్తుదారులను స్వదేశాల నుంచే దరఖాస్తు చేయమనే ఒత్తిళ్లు కూడా పెరిగాయి. వీసా సమస్యలు, ఉద్యోగ కోతల కారణంగా గత రెండేళ్లలో 30,000 మందికి పైగా భారతీయ నిపుణులు అమెరికా నుంచి తిరిగివచ్చారని నివేదికలు పేర్కొంటున్నాయి.

ఇందులో ఒక ముఖ్యమైన సవరణ ఏమంటే.. లక్ష డాలర్ల రుసుము ఇప్పుడు వసూలు కావడం లేదు. జూన్ 8న మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు దాన్ని చెల్లని "పన్ను"గా కొట్టేసింది; జులై 24న అప్పీళ్ల కోర్టు (ఫస్ట్ సర్క్యూట్) ఆ తీర్పును నిలిపివేయడానికి నిరాకరించింది; సెప్టెంబర్ 30న కాలిఫోర్నియా కోర్టు కూడా దాని అమలు విధానాలను అడ్డుకుంది. అయితే ప్రభుత్వం అప్పీల్ చేసింది, ట్రంప్ సెప్టెంబర్ 18న ఆ రుసుమును 2027 సెప్టెంబర్ వరకు పొడిగించారు. వేరే కోర్టు గతంలో ఆ రుసుమును సమర్థించింది. కాబట్టి అది ఇంకా పూర్తిగా పోలేదు, న్యాయపోరాటం కొనసాగుతోంది.

ఇప్పుడు డెమొక్రాట్లు కాంగ్రెస్‌ను నియంత్రిస్తే ఏం జరుగుతుంది? చాలామంది నిపుణులు రాబోయే నెలల్లో వీసా ఆంక్షలు సడలుతాయని భావిస్తున్నారు. కాంగ్రెస్ వ్యతిరేకత ఉన్నప్పుడు కొత్త కఠిన చర్యలను అమలు చేయడం కూడా కష్టమవుతుంది. ఇది భారత ఐటీ రంగానికి శుభవార్తే. కానీ అతి ఆశాభావం తగదు. మొదటిది, కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపడుతుంది, అంతవరకు పాత సమీకరణాలే కొనసాగుతాయి. రెండోది, ఈ ఆంక్షల్లో చాలా భాగం చట్టాల ద్వారా కాదు, అధ్యక్ష ప్రకటనలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు, శాఖల నిర్ణయాల ద్వారా వచ్చాయి; వాటిని కాంగ్రెస్ ఒక్క రోజులో రద్దు చేయలేదు. ఎన్నికలకు ముందే ట్రంప్ తాను "మిస్టర్ వీటో"గా మారతానని అన్నారు; ఫలితాల తర్వాత డెమొక్రాట్లతో "బహుశా కలిసి పనిచేస్తాను" అన్నారు. కాబట్టి సడలింపు కోర్టుల తీర్పులు, చర్చలు, రాజీల ద్వారా వస్తుందే తప్ప ఒక్కసారిగా కాదు. మూడోది, డెమొక్రాట్లు పూర్తిగా హెచ్-1బీ అనుకూలురు కాదు; ఇటీవల రష్యా ఆంక్షల చట్టానికి 58మంది డెమొక్రాట్లు ఓటేసినట్టే, అమెరికన్ ఉద్యోగాల రక్షణ, అవుట్‌సోర్సింగ్ కంపెనీల దుర్వినియోగంపై చర్యలకు ఆ పార్టీలోనూ మద్దతు ఉంది. నైపుణ్యం గల వలసలకు మద్దతు ఇస్తూనే, ఐటీ అవుట్‌సోర్సింగ్ సంస్థలపై ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది. నాలుగోది, 'పెర్మ్' సస్పెన్షన్ ప్రభుత్వం చెప్పే మోసం, ఉల్లంఘనల దర్యాప్తులతో ముడిపడి ఉంది; ఈ ఆరోపణలను కంపెనీలు తమ స్థాయిలో ఎదుర్కొని, నిబంధనల పాటింపును నిరూపించుకోవాలి.

కృత్రిమ మేధ (ఏఐ) ఈ చర్చలో మరో కోణం. ఏఐ వల్ల అమెరికాలో లక్షలాది ఉద్యోగులు ఉపాధి కోల్పోయినా, ట్రంప్ ప్రభుత్వం ఏఐ అపరిమిత వృద్ధికి మద్దతిచ్చింది తప్ప ఏమీ చేయలేదు. డెమొక్రాట్ల కాంగ్రెస్ ఏఐపై కొన్ని నియంత్రణలు తేవచ్చు. అది భారత ఐటీకి కలిసి రావచ్చు. ప్రస్తుతం పెద్ద భారత ఐటీ కంపెనీల ఆదాయంలో ఏఐ వాటా సుమారు 5-6 శాతం మాత్రమే; ఏఐ వల్ల ధరలపై ఒత్తిడి ఎక్కువగా ఉండి ఆదాయ వృద్ధి మందగించిందని, ఏఐ అనుసరణ వేగం తగ్గితే ఆ కంపెనీలు సర్దుబాటు చేసుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుందని, ఆదాయ క్షీణత తగ్గి, ఆపరేటింగ్ మార్జిన్లు కాపాడబడతాయని అర్థం చేసుకోవచ్చు. ఇటీవలి త్రైమాసికాల్లో టెక్ స్టార్టప్‌లు, భారత ఐటీ కంపెనీలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లలో ఉద్యోగ కల్పన మందగించింది; ఇందుకు ప్రధాన కారణం ఏఐ ఆటోమేషన్‌గా భావిస్తున్నారు. అమెరికా నుంచి నైపుణ్యం గల నిపుణులు తిరిగి వస్తుండటంతో ఐటీ ఉద్యోగ మార్కెట్ తీవ్ర పోటీగా మారింది; ఈ ధోరణి తగ్గితే ఉద్యోగులకు మేలు. అయితే ఇక్కడ జాగ్రత్త అవసరం: ఏఐ నియంత్రణలపై ఆశ ఒక ఊహ మాత్రమే; డెమొక్రాట్లు నియంత్రణలు తెస్తారన్న హామీ లేదు, తెచ్చినా ఏఐ వాడకం ఆగదు. కాబట్టి ఇది ఆశించదగినదే కానీ నమ్ముకునే వ్యూహం కాదు.

భారత ఐటీ కంపెనీలు ఇప్పటికే అమెరికాలో స్థానిక నియామకాలు, నియర్‌షోరింగ్, ఏఐ నైపుణ్యాల పెంపు వైపు వెళ్తున్నాయి; అదే దారి కొనసాగించాలి. ప్రభుత్వం భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంలో నిపుణుల రాకపోకలకు ప్రాధాన్యం ఇచ్చి, కాంగ్రెస్‌లో భారత మద్దతును బలోపేతం చేసుకోవాలి. ఉద్యోగులు కొత్త నైపుణ్యాలతో సిద్ధం కావాలి. మన తెలుగు రాష్ట్రాల్లోని చాలా కుటుంబాలకు, అమెరికాలో ఉన్నవారికి, వెళ్లాలనుకునేవారికి, తిరిగి వచ్చినవారికి ఇది నేరుగా సంబంధించిన విషయం. హెచ్-1బీ మార్గంలో అమెరికా వెళ్లిన ఎందరో భారతీయులు అక్కడ గొప్ప విజయాలు సాధించారు; ఆంక్షలు సడలితే "అమెరికా కల" మళ్లీ రెక్కలు తొడగవచ్చు. అది ఎంత త్వరగా, ఎంతవరకు జరుగుతుందన్నది ఎన్నికల ఫలితాలపై కాదు, రాబోయే నెలల్లో కోర్టులు, వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

పనికొచ్చే పలుకు



నిబద్ధత..: సక్సెస్ వెపన్!

జీవితంలో విజయం సాధించాలంటే ఏదోక ప్రత్యేకమైన ప్రతిభ ఉండాలనుకుంటారు చాలామంది. నిజానికి విజయానికి అది తప్పనిసరి అర్హత కాదు. ఎందుకంటే ప్రతిభవున్న ప్రతి ఒక్కరూ విజేత కాలేరు. కానీ సాధారణమైన లక్షణాలను అసాధారణమైన క్రమశిక్షణతో ఆచరించేవారు కచ్చితంగా గమ్యానికి చేరతారు. చిన్న ఎగ్జాంపుల్ తీసుకుందాం. ఇద్దరు వ్యక్తులు ఒకే సమయంలో వ్యాపారం ప్రారంభించారు. ఇద్దరికీ దాదాపు ఒకే పెట్టుబడి, ఒకే రకమైన అవకాశాలు, ఒకే మార్కెట్ పరిజ్ఞానం ఉన్నాయి. మొదటి వ్యక్తి ప్రతిరోజూ కొత్త ఆలోచనలతో ఉత్సాహంగా పనిచేస్తాడు. కానీ కొద్దిరోజులకే ఆసక్తి తగ్గింది. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోతే నిరుత్సాహపడతాడు. రెండో వ్యక్తి మాత్రం -ప్రతిరోజూ నిర్దిత సమయంలో పని మొదలుపెడతాడు. ఎదురైన సమస్యలను పరిష్కరించుకుంటాడు. నష్టాలనుంచి నేర్చుకుంటాడు. చిన్న విజయాలను ఆస్వాదిస్తూనే ప్రయత్నాన్ని కొనసాగిస్తాడు. కొంతకాలానికి వీరిద్దరి మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది. మొదటి వ్యక్తి దగ్గర ఆలోచనలుంటే, రెండో వ్యక్తి దగ్గర అనుభవం, ఫలితాలు, ఎదుగుదల కనిపిస్తాయి. ఇద్దరి మధ్య తేడా ప్రతిభ కాదు.. పనిపట్ల నిబద్ధత!

విజయానికి అవసరమైన మొదటి లక్షణం నిలకడ. ఏ పనినైనా ఒకరోజు ఉత్సాహంగా చేయడం గొప్ప విషయం కాదు. ఆసక్తి తగ్గిన రోజుల్లోనూ అదే పనిని కొనసాగించడం అసలైన గొప్పతనం. వ్యాయామం చేయాలనుకున్నప్పుడు మొదటిరోజు గంటసేపు చేయడం కంటే, ప్రతిరోజూ ఇరవై నిమిషాలు క్రమం తప్పకుండా చేయడం ఎక్కువ ప్రయోజనాన్నిస్తుంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం, ఆరోగ్యం.. ఏ విషయంలోనైనా నిలకడే అలవాటును నిర్మిస్తుంది. అలవాటే చివరకు మన వ్యక్తిత్వాన్ని మార్చుతుంది. రెండో లక్షణం -పట్టుదల. మనం అనుకున్నది వెంటనే జరగాలని ఆశించడం సహజం. కానీ జీవితంలో ప్రతి ప్రయత్నానికీ తక్షణ ఫలితం రాదు. కొన్నిసార్లు ఎంత కష్టపడినా పరిస్థితులు అనుకూలించవు. అలాంటప్పుడు లక్ష్యాన్ని వదిలేయడం పరిష్కారం కాదు. అవసరమైతే పద్ధతిని మార్చుకోవాలి. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ఓటమిని మన సామర్థ్యానికి ఇచ్చిన తీర్పుగా కాకుండా, మన ప్రయాణంలో ఎదురైన అనుభవంగా చూడాలి.

మూడో లక్షణం కష్టపడటానికి సిద్ధంగా ఉండడం. చాలామందికి విజయం కావాలి. కానీ దాని కోసం చెల్లించాల్సిన శ్రమను భరించడానికి మాత్రం ఇష్టపడరు. సౌకర్యాలను వదులుకోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, అవసరం లేని అలవాట్లను తగ్గించుకోవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం.. ఇవన్నీ కష్టంలో భాగమే. మనం ప్రతిరోజూ చేసే చిన్న చిన్న ఎంపికలే భవిష్యత్తులో మన స్థాయిని నిర్ణయిస్తాయి. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కష్టపడటం అంటే విశ్రాంతి లేకుండా పనిచేయడం కాదు. సరైన దిశలో, సరైన పద్ధతిలో, మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పనిచేయడం. కేవలం బిజీగా ఉండటం విజయానికి గుర్తు కాదు. మన సమయం, శక్తి ఏ దిశలో ఖర్చవుతున్నాయన్నదే ముఖ్యం. కాబట్టి మీ జీవితాన్ని మార్చుకోవడానికి రేపటి నుంచి ఏదో అద్భుతం జరగాలని చూడకండి. ఈరోజు నుంచే మంచి అలవాటును ప్రారంభించండి. నిర్ణయించుకున్న పనిని పూర్తి చేయండి. సమయాన్ని గౌరవించండి. నిన్నటి మీకంటే ఈరోజు మీరు కొంచెం మెరుగ్గా ఉండటానికి ప్రయత్నించండి.

గుర్తుంచుకోండి.. విజేతలను ప్రత్యేకంగా నిలబెట్టేది వాళ్లకు మాత్రమే ఉన్న ప్రతిభ కాదు. అందరికీ అందుబాటులో ఉన్న సాధారణ లక్షణాలను వాళ్లు అసాధారణమైన స్థాయిలో ఆచరించడమే! ప్రతిభ మీకు ఒక అవకాశాన్ని ఇవ్వవచ్చు. కానీ నిలకడ, పట్టుదల, నిరంతర శ్రమ మాత్రమే ఆ అవకాశాన్ని విజయంగా మారుస్తాయి.

అగ్నివీరులకు బిగ్ ఛాన్స్!

నాలుగేళ్ల క్రితం తెచ్చిన అగ్నిపథ్ పథకంలో కేంద్రం కీలక మలుపు తీసుకుంది. నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల సేవ, ఆపై శాశ్వత సైనికులయ్యే అవకాశమిచ్చింది. యువతకు ఊరట దక్కినా, పెరిగే జీతాలు, పెన్షన్ల భారాన్ని ఎలా అదుపు చేస్తారన్న ప్రశ్న మిగిలే ఉంది. సైనిక సంస్కరణ ఎన్నికల రాజకీయాలకు బందీ కాకుండా, యువత భద్రత, సైన్య సామర్థ్యం, ఖజానా నిలకడల మధ్య సమతుల్యం సాధించాలి.



నాలుగేళ్ల క్రితం తెచ్చిన అగ్నిపథ్ పథకంలో కేంద్రం కీలక మార్పులు చేసింది. నవంబర్ 4న కేంద్ర మంత్రివర్గం, త్రివిధ దళాల సిఫార్సుల ఆధారంగా, నాలుగేళ్ల సేవ తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల సేవా కాలాన్నిచ్చింది. ఆ రెండేళ్లు పూర్తయ్యాక అందరినీ రెగ్యులర్ సైనికులుగా చేర్చుకునే మార్గాన్ని తెరిచింది, అయితే వారి ఇష్టం, ఎంపిక ప్రమాణాల ఆధారంగా. మొదటి నాలుగేళ్ల తర్వాత మెరిట్ ఆధారంగా 25 శాతం మందిని రెగ్యులర్ సైనికులుగా తీసుకునే పద్ధతి కొనసాగుతుంది; వారు రెండేళ్ల తర్వాత చేరేవారికంటే సీనియర్లుగా ఉంటారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రెండేళ్లను "సెకండ్ టూర్ ఆఫ్ డ్యూటీ"గా వర్ణిస్తూ, ఇది "యువ, ఫిట్, సాంకేతికంగా సిద్ధమైన, భవిష్యత్తుకు సన్నద్ధమైన సైన్యం" కోసం చేస్తున్న దీర్ఘకాల నిర్మాణ సంస్కరణల్లో భాగమన్నారు. రెండో సేవా కాలంలో ఎక్కువ జీతం, మెరుగైన సేవా నిధి, సీనియారిటీ ప్రయోజనాలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం సమయం గమనార్హం: మొదటి బ్యాచ్‌కు చెందిన సుమారు 18,300 మంది అగ్నివీరులు డిసెంబర్ 31నాటికి నాలుగేళ్ల సేవ పూర్తి చేసుకుని బయటకు వెళ్లాల్సి ఉండగా, కేవలం మూడు వారాల ముందు ఈ మార్పు వచ్చింది. పైగా వచ్చే ఏడాదిలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి; ఈ రాష్ట్రాల యువతకు సైన్యంలో ఉద్యోగం కుటుంబ సంప్రదాయం, సామాజిక పురోగతికి మార్గం. కాంగ్రెస్ దీన్ని "యూ-టర్న్" అని విమర్శించింది; పథకాన్ని మొదటి నుంచీ రాహుల్ గాంధీ వ్యతిరేకించారని, ఆయన లేవనెత్తిన ఆందోళనలనే ప్రభుత్వం ఇప్పుడు గుర్తించిందని వాదించింది. ఏమైనా, ప్రభుత్వం తాను తెచ్చిన విధానాన్నే వెనక్కి తీసుకుని, అందరు అగ్నివీరులకు శాశ్వత సైనికులయ్యే మార్గాన్ని సృష్టించింది.

అసలు అగ్నిపథ్ ఎందుకు వచ్చింది? 2022 జూన్‌లో ప్రకటించిన ఈ పథకం ప్రకారం 17.5 నుంచి 21 ఏళ్ల యువతను నాలుగేళ్లకు సైన్యంలోకి తీసుకుంటారు. అందులో 25 శాతం మందికే శాశ్వత సేవ, మిగతా 75 శాతం మందికి పన్ను లేని సుమారు రూ.11.71 లక్షల 'సేవా నిధి' ఇచ్చి పంపేస్తారు; వారికి గ్రాట్యుటీ, పెన్షన్ ఉండవు. సైనికుల సగటు వయసును తగ్గించాలని కార్గిల్ సమీక్ష కమిటీ రెండు దశాబ్దాల క్రితమే సిఫార్సు చేసింది. సిబ్బంది భారాన్ని తగ్గించి, ఆధునికీకరణకు నిధులు విడుదల చేయడం ఈ పథకం లక్ష్యం. 2014-15 నుంచి 'ఒక ర్యాంకు, ఒక పెన్షన్' (ఓఆర్ఓపీ) అమలైన తర్వాత సైనిక జీతాలు, పెన్షన్లు విపరీతంగా పెరిగాయి; రక్షణ బడ్జెట్‌లో సగానికి పైగా వాటికే పోతోందని రక్షణ విశ్లేషకుల అంచనా. ఇది ఎంతోకాలం నిలిచే పరిస్థితి కాదు. చైనా కూడా తన పీఎల్‌ఏ సైన్యం పరిమాణాన్ని 23 లక్షల నుంచి 20 లక్షలకు తగ్గించింది; చురుకైన, సాంకేతికంగా నైపుణ్యం గల, మరింత సమైక్యమైన సైన్యమే దాని లక్ష్యం. కాబట్టి అలాంటి పునర్వ్యవస్థీకరణకు భారత్ ప్రయత్నించడం స్వాగతించదగ్గదే. కానీ అగ్నిపథ్ ఆలోచన భారత వాస్తవికతలను దాటాల్సి వచ్చింది. మొదటిది, చాలామంది గ్రామీణ యువతకు శాశ్వత సైనిక ఉద్యోగం కుటుంబ సంప్రదాయం, సామాజిక ఎదుగుదలకు దారి. నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లే 75 శాతం మందికి వారి అనుభవానికి తగిన మంచి పౌర ఉద్యోగాలు దొరికితేనే మొదటి పథకం పనిచేసేది; కానీ అలాంటి అవకాశాలు అనుకున్నంతగా రాలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. రెండవది, సైన్యంలోనే ఆందోళనలున్నాయి. ఆధునిక యుద్ధానికి సైనికులను పూర్తిగా సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది, కాబట్టి నాలుగేళ్లకే చాలామందిని పంపేయడం అంతరాయం కలిగిస్తుంది. పైగా అగ్నివీరులు, శాశ్వత సైనికులు ఒకే యూనిట్లలో ఒకే పనులు చేస్తున్నా, వారి ప్రయోజనాల్లో భారీ తేడా ఉండటంతో సమైక్యత దెబ్బతింటుందన్న భయం ఉంది. మూడవది, శిక్షణ పొంది బయటకు వచ్చిన యువకులను సంఘ వ్యతిరేక శక్తులు లేదా కిరాయి సైనిక గుంపులు ఆకర్షించవచ్చన్న ఆందోళన. ఈ నేపథ్యంలో 75 శాతం మందికి మరో రెండేళ్ల సేవ, ఆ తర్వాత శాశ్వత నియామకం అనే కొత్త నిర్ణయం, ఈ ఆందోళనల్లో చాలా వాటిని పరిష్కరిస్తుంది.

అయితే ప్రాథమిక సమస్య ఇంకా మిగిలే ఉంది: పెరిగిపోతున్న జీతాలు, పెన్షన్ల భారం. చివరికి అందరినీ శాశ్వత సైనికులను చేస్తే, పథకం అసలు ఉద్దేశం పలుచబడి పాత పద్ధతికి దగ్గరగా వెళ్లే ప్రమాదముంది. రెండు సరిహద్దుల్లో శత్రు సవాళ్లను ఎదుర్కొంటున్న సైన్యానికి ఖర్చుల భారం, ఆధునికీకరణ లోటు ఒకేసారి భారమవుతాయి. కాబట్టి ఏటా తీసుకునే సైనికుల సంఖ్యను ఒకేసారి కాకపోయినా, ఉదాహరణకు ఐదేళ్లలో క్రమంగా తగ్గించవచ్చా అన్నది ఆలోచించదగ్గ ప్రశ్న. దీనికి శాశ్వత పరిష్కారం ఒక్కటే: అర్ధ-నైపుణ్యం గల యువతకు తగిన జీతాలు ఇచ్చే పౌర ఉద్యోగాలు తగినన్ని ఉండటం, అప్పుడు సమస్యే ఉండదు. కానీ అదే భారత్‌కు అతిపెద్ద సవాలు, దానికి పరిష్కారం ఇంకా కనిపించడం లేదు. కొత్త ఏర్పాటులో కొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. "ఇష్టం, ఎంపిక ప్రమాణాల ఆధారంగా" అనే షరతు ఆచరణలో ఎంత కఠినంగా అమలవుతుంది? రెండేళ్ల తర్వాత కూడా ఎంపిక కాని వారికి భవిష్యత్తు ఏమిటి? మొదటి 25 శాతం, తర్వాత చేరే 75 శాతం మధ్య సీనియారిటీ తేడాలు యూనిట్లలో కొత్త అసంతృప్తికి దారి తీయవా? ఇక్కడ ప్రభుత్వం కొన్ని విషయాలు స్పష్టం చేయాలి: పథకం కొనసాగుతుందని చెబుతున్నారు, అలాంటప్పుడు కొత్త ఏర్పాటు వల్ల బడ్జెట్‌పై నిజమైన ప్రభావం ఎంత, ఎంతమంది చివరికి శాశ్వత సైనికులవుతారు, సైన్యం యువతకు, అనుభవానికి మధ్య సమతుల్యాన్ని ఎలా సాధిస్తుంది? ఈ లెక్కలను పార్లమెంటుకు, ప్రజలకు ముందుగానే చెప్పాలి. అలాగే అగ్నివీరులకు ఆ రెండేళ్లలో స్పష్టమైన శిక్షణ, నైపుణ్య ధృవీకరణలు ఇవ్వడం, సేవా కాలం పూర్తయ్యాక ఉద్యోగాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరం. సైనిక సంస్కరణ ఎన్నికల రాజకీయాలకు బందీ కాకూడదు: యువతకు భద్రత, సైన్యానికి సామర్థ్యం, ఖజానాకు నిలకడ, ఈ మూడింటినీ సమతుల్యం చేసేలా సంస్కరణ కొనసాగాలి. ■



మీ జీవితంలోని ప్రతి వయసును, మార్పును, అనుభవాలను దగ్గరగా చూసే ఏకైక సాక్షి మీరే! మీ తల్లిదండ్రులకు మీ వృద్ధాప్యం తెలియదు. మీ జీవిత భాగస్వామికి మీ బాల్యం పరిచయముండదు. మీ పిల్లలకు మీ యవ్వనం తెలీదు. కానీ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మీ ప్రతి రూపంతో ప్రయాణించేది మీరొక్కరే. అందుకే ఇతరుల ప్రేమ కోసం ఎదురుచూస్తూ మిమ్మల్ని మీరు నిర్లక్ష్యం చేసుకోకండి. మీకు మీరే విలువ ఇవ్వండి. మనస్ఫూర్తిగా ప్రేమించుకోండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ఎందుకంటే మీ జీవిత ప్రయాణంలో చివరి వరకు మీతో ఉండాల్సిన వ్యక్తి మీరే!

-మహాదేవ

వింతల్లో వింతలు

ఐస్‌తో గేమ్. గిన్నిస్‌లో ప్లేస్!



సాధారణంగా ఐస్ ముక్కల్ని నోట్లో వేసుకుంటే చల్లగా ఉంటుంది. కానీ అమెరికాలోని ఇడాహోకు చెందిన డేవిడ్ రష్ మాత్రం వాటితోనే గిన్నిస్ రికార్డు సృష్టించాడు! రెండు ట్రేల మధ్య చేతులు ఉపయోగించకుండా కేవలం నోటితో ఐస్ ముక్కలను తరలించే సాహసం చేశాడు. అదీ కేవలం 30 సెకన్లలో ఏకంగా 991 గ్రాముల ఐస్‌ను తరలించాడు. ఒక్కో ముక్క బరువు 25 గ్రాములకు మించకూడదట. మరీ చల్లగా ఉంటే పెదాలకు అతుక్కుపోతాయట.. వేడిగా ఉంటే కరిగిపోతాయట! ఇప్పటికే 200కు పైగా గిన్నిస్ రికార్డులున్న ఈ ఘనుడికి.. ఐస్‌తోనూ చల్లటి రికార్డే సొంతమైంది!

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం.. అండర్-19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ఆర్యవీర్ సెహ్వాగ్ 70 పరుగులతో అజేయ ఇన్నింగ్స్

కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీకి అర్ధశతకం

ఇషాన్ సూద్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు

ఆదివారం పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్



అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (53 నాటౌట్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. తొలుత బౌలర్లు నేపాల్‌ను 128 పరుగులకే కట్టడి చేయగా.. భారత ఓపెనర్లు లక్ష్యం చిన్నదిగా మార్చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఇషాన్ సూద్ అదిరిపోయే ఆరంభం అందించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ నేపాల్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. 10 ఓవర్లలో నాలుగు మెయిడిన్లతో కేవలం 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో నేపాల్ టాపార్డర్ కుప్పకూలింది. దర్శ్ సోనార్ (43) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆశిష్ లుహార్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాక నేపాల్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అర్జున్ రాజ్‌పుత్ 3, యశ్వీర్ గౌడ్ 2 వికెట్లు తీయడంతో నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆర్యవీర్, లక్ష్య రాయ్‌చందానీ అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి కొన్ని ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. ఆ తర్వాత బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా నేపాల్ స్పిన్నర్లపై ఆర్యవీర్ ఎదురుదాడికి దిగాడు. క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లు ఆడుతూ కేవలం 34 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు లక్ష్య రాయ్‌చందానీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.ఈ గెలుపుతో 'గ్రూప్-ఏ'లో భారత్ రెండు పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. నెట్ రన్‌రేట్ 4.170గా నమోదైంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!

ఈ ఘనత సాధించడం కష్టమేనన్న అభిషేక్ నాయర్

ప్రపంచకప్ తర్వాత ఆడినా అతడి ఆటతీరు ఎలా ఉంటుందో అని సందేహం

వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు

హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలన్న నాయర్

బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం అని వ్యాఖ్య



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు.భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు.వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు.ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు.మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు.వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

బెబో స్ఫూర్తితో సైజ్ జీరోకి మారిన 'అర్జున్ రెడ్డి' బ్యూటీ



అందమైన ఆకుపచ్చ పట్టు చీరలో మెరిసిపోతున్న రాశి సింగ్



'అర్జున్ రెడ్డి'తో గుర్తింపు తెచ్చుకున్న శాలిని పాండే తన సరికొత్త స్లిమ్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన డిజైనర్ ఫోటోషూట్ చిత్రాలు వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె గ్లామర్‌ను ప్రశంసిస్తున్నారు. 'మహానటి', '118', 'నిశ్శబ్దం', 'జయేశ్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించిన శాలిని ప్రస్తుతం విభిన్న పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన -అర్జున్ రెడ్డి- చిత్రంలో బొద్దుగా, అమాయకమైన చూపులతో లవ్లీ -ప్రీతి శెట్టి-గా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన శాలిని పాండే ఇప్పుడు గ్లామర్ రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. నాడు బాలీవుడ్ బెబో కరీనా కపూర్ ఖాన్ చూపించిన సైజ్ జీరో స్ఫూర్తితో తీవ్రంగా శ్రమించిన ఈ బ్యూటీ, బాగా స్లిమ్ అయి సరికొత్త జీరో సైజ్ అవతారంలోకి మారిపోయింది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన డిజైనర్ డ్రెస్ ఫోటోషూట్‌లో శాలిని అందం కవ్విస్తూ.. ట్రెండీ గ్లామర్‌తో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది.ఈ సరికొత్త ఫోటోషూట్ కోసం స్టైలిస్టులు గౌర్వి దేశాయ్, నూపుర్ అభయ్ పధ్యే, హెయిర్ స్టైలిస్ట్ ప్రతీక్ష ముచండికర్, మేకప్ ఆర్టిస్ట్ సిమువా, ఫోటోగ్రాఫర్ ప్రిషా చందేల బృందం కలిసి పనిచేసింది. ఈ ఫోటోలకు శాలిని సింపుల్‌గా వర్ణనగా సింబాలిక్‌గా ఎమోజీలను క్యాప్షన్‌గా జోడించింది. కొద్ది గంటల్లోనే వైరల్‌గా మారిన ఈ పోస్ట్ కామెంట్ సెక్షన్‌లో అభిమానులు ఫైర్, హార్ట్ ఎమోజీలతో ప్రశంసల వర్షం కురిపించారు.--అందానికి ఒక పేరు ఉంటే అది కచ్చితంగా నీదే-- అంటూ నెటిజన్లు శాలిని స్టైలింగ్‌ను కొనియాడుతున్నారు.అందమైన ప్రశంసలతో పాటు.. శాలిని నటించిన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కొన్ని కామెడీ డైలాగ్‌లు కూడా కామెంట్స్‌లో రీసౌండ్ చేస్తున్నాయి. ప్రత్యేకించి --దేఖో పాపా మైనే క్యా ఉగాయా హై.. గంజా పాపా గంజా-- అనే పాపులర్ డైలాగ్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆ సీన్‌తోనే తాము శాలినికి వీరాభిమానులుగా మారామని పలువురు నెటిజనులు కామెంట్లు చేశారు. మొత్తానికి.. ఈ పోస్ట్ శాలిని పాండే ఫ్యాషన్ సెన్స్, మోడర్న్ గ్లామర్ ..స్లిమ్ లుక్ ట్రీమ్ ప్రెజెన్స్‌ను మరోసారి చాటిచెప్పడమే కాకుండా.. సోషల్ మీడియాలో ఈ యంగ్ బ్యూటీకి ఉన్న విపరీతమైన క్రేజ్‌ను ప్రతిబింబిస్తోంది. 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన -అర్జున్ రెడ్డి- చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చుకున్న శాలిని పాండే.. ఆ తర్వాత భిన్నమైన పాత్రలను ఎంచుకుంది. -మహానటి-లో సుశీల పాత్రలో.. కల్యాణ్ రామ్ సరసన 118 అనే హిట్ మూవీలో -మేఘ-గా, అలాగే -ఎన్.టి.ఆర్. కథానాయకుడు-, -ఇద్దరి లోకం ఒకటే-, .. అనుష్క శెట్టి ద్విభాషా చిత్రం -నిశ్శబ్దం-లో కీలక పాత్రల్లో నటించి మెప్పించింది. అనంతరం తమిళంలో 100శాతం కాదల్, గోరిల్లా చిత్రాలతో అదుగుపెట్టి.. రణ్‌వీర్ సింగ్ సరసన -జయేశ్‌భాయ్ జోర్దార్ (2022)- చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇటీవల ఓటీటీ మూవీ -మహారాజ్ (2024)- లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

ప్రస్తుతం శాలిని పాండే కెరీర్ ఎలా ఉంది? రేసులో వెనకబడిందా?

తొలి సినిమా -అర్జున్ రెడ్డి- సాధించిన భారీ విజయం తర్వాత శాలిని పాండే టాలీవుడ్‌లో హీరోయిన్‌గా వరుస ఆఫర్లు అందుకుంది. కానీ బాలీవుడ్ లో బిజీ అయ్యాక తెలుగులో కొంతవరకు వెనకబడినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్ లో క్రేజీ ప్రాజెక్ట్‌లు చేయలేకపోయినా.. సౌత్ నుండి బాలీవుడ్ వరకు కథాబలం ఉన్న విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన ఉనికిని చాటుకుంటోంది. ప్రస్తుతం సరికొత్త జీరో సైజ్ మేకోవర్‌తో మరింత గ్లామరస్‌గా తయారైన శాలిని పాండే.. మళ్లీ మునుపటి జోరు అందుకుంటుందో లేదో చూడాలి.

వామికా గబ్బి నల్ల చీర ఫోటోలు కాలాతీతమైన సాంప్రదాయ సొబగును ప్రదర్శిస్తున్నాయి



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965